


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 07 మే 2021 సంపుటి : 02 సంచిక : 296 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఏపి లో మారిన బ్యాంక్స్ పనివేలలు

అమరావతి మే 6 ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ విజృంభణతో రోజురోజుకు పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. దీంతో కరోనా కట్టడికి రాష్ట్రంలో కర్ఫ్యూ విధించింది. దీంతో ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ అమలు చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించుకోవడాని ప్రభుత్వం అనుమతిస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బ్యాంకుల పనివేళలు కూడా మారాయి. గురువారం నుంచి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకే బ్యాంకులు పనిచేస్తాయని అధికారులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసుల తీవ్రత నానాటికీ అధికమవుతుండటంతో ప్రభుత్వం నివారణా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నిన్?టి నుంచి రాష్ట్రంలో ప్రతిరోజూ 18 గంటల చొప్పున కర్ఫ్యూ అమలు చేస్తున్నది.

# కోవిడ్ పేషెంట్లకు తప్పనిసరిగా బెడ్లు ఇవ్వాలి: సీఎం జగన్

### కోవిడ్ నియంత్రణ, వ్యాక్సినేషన్‌పై సమీక్ష
### ఆరోగ్యశ్రీ కింద కోవిడ్ పేషెంట్లకు ఉచితంగా వైద్యసేవలు: సీఎం జగన్
### కోవిడ్ ఆస్పత్రుల వద్దనే కోవిడ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న సీఎం



అమరావతి : ఆరోగ్యశ్రీ ఆస్పత్రులలో కోవిడ్ పేషెంట్లకు తప్పనిసరిగా బెడ్లు ఇవ్వాలని, ఎంప్యానెల్ చేసిన ఆస్పత్రుల్లో విధిగా 50 శాతం బెడ్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. అంత కంటే ఎక్కువ రోగులు వచ్చినా తప్పనిసరిగా చేర్చుకోవాలన్నారు. టెంపరరీ ఎంప్యానెల్ ఆస్పత్రుల్లో కూడా 50 శాతం బెడ్లు ఇవ్వాలని, కలెక్టర్లు నోటిఫై చేసిన నాన్ ఎంప్యానెల్ ఆస్పత్రులూ ఆ బెడ్లు ఇవ్వాలని చెప్పారు. అందుకోసం ఆ ఆస్పత్రులను తాత్కాలికంగా ఎంప్యానెల్ చేయాలన్నారు. కోవిడ్ పేషెంట్లకు ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో కోవిడ్-19 నియంత్రణ, నివారణ, వ్యాక్సినేషన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం రికార్డు స్థాయిలో పరీక్షలు చేస్తున్నాము. మన రికార్డులను మనమే బద్ధలు కొడుతున్నాము. కోవిడ్ చికిత్స కోసం అవసరం మేరకు బెడ్ల సంఖ్య మరింత పెంచండి. ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్ ఆస్పత్రుల్లో తప్పనిసరిగా 50 శాతం బెడ్లు ఇవ్వాలి. అంత కంటే ఎక్కువ రోగులు వచ్చినా విధిగా చేర్చుకోవాలి. తాత్కాలిక ఎంప్యానెల్ ఆస్పత్రుల్లో కూడా 50 శాతం బెడ్లు కేటాయించాలి. కలెక్టర్లు నోటిఫై చేసిన నాన్ ఎంప్యానెల్ ఆస్పత్రుల్లోనూ 50 శాతం బెడ్లు ఇవ్వాలి. అందుకోసం ఆయా ఆస్పత్రులను తాత్కాలికంగా ఎంప్యానెల్ చేసి, వాటిలో సగం బెడ్లు మీరే కేటాయించండి. కోవిడ్ చికిత్స కోసం తీసుకున్న అన్ని ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా చికిత్స చేయాలి. ఇందులో ఎక్కడా తేడా రాకూడదు. ప్రభుత్వ, ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్‌లో ఉన్న వాటితో సహా, అన్ని ఆస్పత్రుల్లో కోవిడ్ చికిత్స ఒకేలా ఉండాలి.ఆరోగ్యశ్రీ ఆస్పత్రిలో ఉన్న బెడ్లు ఎన్ని? వాటిలో ఎన్ని కోవిడ్ రోగులకు ఇస్తున్నారు? అన్నది పూర్తి క్లారిటీ ఉండాలి. దాని వల్ల ఆస్పత్రుల్లో ఎన్ని బెడ్లు కోవిడ్ రోగులకు ఇస్తున్నామన్నది మనకు స్పష్టత వస్తుంది. అలా రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్ ఆస్పత్రులలో ఎన్ని బెడ్లు కోవిడ్ రోగులకు ఉన్నాయన్న దానిపై మనకు పూర్తి స్పష్టత ఉంటుంది. ఆ విధంగా ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రైవేటు ఆస్పత్రులు అన్నింటిలో కలిపి కోవిడ్ రోగులకు మొత్తం ఎన్ని బెడ్లు ఉన్నాయన్నది తెలుస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రుల బెడ్లు. ప్రైవేటు ఆస్పత్రుల బెడ్లు. ఎన్నెన్ని అన్నదానిపై స్పష్టత వస్తుంది. 104 కాల్ సెంటర్‌కు ఫోన్ వస్తే, ఆ రోగి ఉన్న ప్రాంతాన్ని బట్టి, ఆ జిల్లాకు మెసేజ్ వెళ్తుంది. వెంటనే కలెక్టర్, జిల్లా యంత్రాంగం స్పందించి, ఆయా ఆస్పత్రులలో రోగులను చేర్పించాలి. ఇది ప్రక్రియ. ఏ ఆస్పత్రి కూడా రోగుల నుంచి ఇష్టానుసారం ఫీజులు వసూలు చేయకుండా చూడాలి. కోవిడ్ రోగులకు పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందించాలి. అన్ని కోవిడ్ ఆస్పత్రుల వద్ద కోవిడ్ కేర్ సెంటర్లు హ్యాంగర్లు పెట్టి ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

ఆస్పత్రి వైద్యులే అక్కడ కూడా సేవలందిస్తారు. అక్కడ అన్ని వసతులు తప్పనిసరిగా ఉండేలా చూడాలి.రాష్ట్రంలో ప్రస్తుతం 108 ప్రభుత్వ ఆస్పత్రులు. 349 కార్పొరేట్ ఎంప్యానెల్ ఆస్పత్రులు. 47 కార్పొరేట్ టెంపరరీ ఎంప్యానెల్ ఆస్పత్రులు. 94 ప్రైవేట్ కేటగిరీ ఆస్పత్రులు. ఆ విధంగా మొత్తం 598 ఆస్పత్రుల్లో 48,439 ఉండగా, వాటిలో 41,517 మంది చికిత్స పొందుతున్నారు. మరో 6922 బెడ్లు ఖాళీగా ఉన్నాయి. ఆస్పత్రులలో ఉన్న వారిలో 24,500 మంది రోగులు ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్నారు.అన్ని కోవిడ్ ఆస్పత్రులలో ఫుడ్ క్వాలిటీ, శానిటేషన్ బాగుండాలి. ఎక్కడా ఏ లోపం లేకుండా ఉండాలి. శానిటేషన్, క్వాలిటీ ఫుడ్, డాక్టర్ల అందుబాటు, ఆస్పత్రిలో వైద్య సదుపాయాలు, ఆక్సీజన్.. ఈ 5 మనకు చాలా ముఖ్యం. వైద్యులు లేకపోతే వెంటనే తాత్కాలికంగా అయినా నియామకాలు జరగాలి.ఆక్సిజన్ సరఫరా, నిల్వలో ఎక్కడా ఏ లోపం ఉండకూడదు. ఎక్కడైనా అవసరం అయితే తగిన మరమ్మతులు చేయండి. కేంద్రం ఇంకా ఎక్కువ ఆక్సిజన్ సరఫరా చేసేలా కృషి చేయడంతో పాటు, ఇతర ప్రత్యామ్నాయాలు ఏమిటన్నది ఆలోచించండి. ప్రతి టీచింగ్ ఆస్పత్రి వద్ద 10 కెఎల్ సామర్థం, ఇతర ఆస్పత్రుల వద్ద 1 కెఎల్ సామర్థంతో ఆక్సీజన్ స్టోరేజీ ఉండాలి. వీలైనంత త్వరగా అవి ఏర్పాటు కావాలి. మనకు రోజుకు 500 టన్నుల ఆక్సీజన్ కావాలంటే, ఏం చేయాలన్నది ఆలోచించండి. సరఫరా. నిల్వ ఎలా అన్నది చూడండి.

---

# ఆర్టీసీ డిపో, ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం జగన్

### తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం జగన్





అమరావతి: కడపలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏరియా ఆస్పత్రిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ నుంచి గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. అదే విధంగా చిత్తూరు జిల్లా పుంగనూరులో ఆర్టీసీ బస్ డిపోను కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రారంభించారు. కడప డిపోకు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బస్‌స్టేషన్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు ఎంపీ మిథున్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పుంగనూరులో ఆర్టీసీ డిపో ద్వారా ప్రజల కల సాకారమైందన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రవాణా శాఖ మంత్రి పేర్ని నాని, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్‌పీ ఠాకూర్, ఆర్టీసీ ఈడీలు కృష్ణమోహన్, కోటేశ్వరరావుతో పాటు, పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పుంగనూరు నుంచి ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డప్ప, పలువురు ఎమ్మెల్యేలు, కడప నుంచి డిప్యూటీ సీఎం అంజద్ బాషా, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యేలు, కడప మేయర్ సురేష్‌బాబు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ, “ఈ రోజు ఆర్టీసీ ఆధ్వర్యంలో పుంగనూరులో బస్సు డిపోను ప్రారంభించడం, అదే మాదిరిగా కడపలో డాక్టర్ వైఎస్సార్ ఏరియా ఆస్పత్రి, ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం మంచి పరిణామం. కోవిడ్ సమయంలో ఆరోగ్య శాఖతో పాటు, ఆర్టీసీ కూడా ఆస్పత్రిని ప్రారంభించి, సేవలు అందించడం అభినందనీయం. ఈ ఆస్పత్రి వల్ల సంస్థ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. వీటిపై ఆనాడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను. ఇది దేవుడు నాకిచ్చిన అదృష్టం. మీకు ఇంకా మంచి చేయాలని, ఆ అవకాశం దేవుడు నాకివ్వాలని కోరుకుంటున్నానని సీఎం జగన్ అన్నారు..“గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ బస్సు డిపోలు మూతబడే పరిస్థితి తీసుకువచ్చి, దాన్ని ప్రైవేటుపరం చేసే ప్రయత్నం జరిగింది. కానీ మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారు. 50 వేల మంది కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల రూ.3600 కోట్ల భారం ఏటా పడుతున్నా, ప్రభుత్వం వెనుకంజ వేయలేదు. అంత గొప్ప మనసున్న వ్యక్తి సీఎం జగన్. కడపలో 20 పడకల ఏరియా ఆస్పత్రి ప్రారంభం. మరో వైపు పుంగనూరు డిపోను ఇవాళ ప్రారంభించారు. కార్మికుల కోసం ఇంతగా ఆలోచిస్తున్న ఇలాంటి సీఎం మనకు ఉండటం ఎంతో అదృష్టమనివవ మంత్రి పేర్ని నాని అన్నారు.

# వ్యాక్సినేషన్ ప్రక్రియ ముమ్మరం : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ : భారత్ లో కరోనా వైరస్ కేసులు వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం రా(ష్టాలు, జిల్లాల వారీగా కొవిడ్-19 పరిస్థితిపై సమీక్షించారు. కొవిడ్-19 సెకండ్ వేవ్ విరుచుకుపడుతున్నందున దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ జోరు తగ్గకుండా రా(ష్టాలు చర్యలు చేపట్టాలని కోరారు. లాక్ డౌన్ లు అమల్లో ఉన్నా ప్రజలు వ్యాక్సిన్ వేసుకునేందుకు వెనకాడరాదని, వ్యాక్సినేషన్ డ్యూటీలో ఉన్న ఆరోగ్య సిబ్బందిని వేరే విధులకు మళ్లించరాదని సూచించారు.ఆరోగ్య మౌలిక

సదుపాయాలను మెరుగుపరిచేందుకు రా(ష్టాలకు సహకరించాలని అధికారులు, కేంద్ర మంత్రులను కోరారు. 12 రా(ష్టాల్లో లక్షకు పైగా యాక్టివ్ కేసులున్నాయని ప్రధానికి అధికారులు వివరించారు. కరోనా తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాల వివరాలను నివేదించారు. కరోనా చికిత్సలో ఉపయోగించే మందుల లభ్యతను ప్రధాని సమీక్షించారు. రెమ్డిసివిర్ సహా కరోనా ఔషధాల ఉత్పత్తిని పెంచినట్టు అధికారులు ప్రధానికి వివరించారు.

# రేపటికల్లా ఆత్మకూరుకు ఆక్సిజన్ సరఫరా: మంత్రి గౌతమ్‌రెడ్డి

నెల్లూరు : రేపటికల్లా ఆత్మకూరుకు ఆక్సిజన్ సరఫరా చేస్తామని మంత్రి గౌతమ్ రెడ్డి అన్నారు. మరో 100 ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లు తెప్పిస్తున్నామని చెప్పారు. కోవిడ్ సమయంలో రోగులు కోలుకోవడానికి ఇచ్చే ఔషధాల సరఫరా, డిమాండ్, ఐసోలేషన్ కిట్ల పంపిణీ తదితర అంశాలపై కలెక్టర్తో మంత్రి మేకపాటి గురువారం చర్చించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూడాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలోని కోవిడ్ ఆసుపత్రులైన జీజీహెచ్, నారాయణ, అపోలో సహా పలు ఆసుపత్రులలో అందుతున్న వైద్య సేవలు, ప్రజల ఇబ్బందులు, కరుణ సోకిన వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు.అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఇలాంటి విపత్కర సమయంలో అందుబాటులో ఉన్నప్పుడే ప్రజాసేవకు అసలైన గుర్తింపని, మండలస్థాయిలో ఉన్నతాధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. నోడల్ అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు.



ఏ ఇబ్బంది రాకుండా చూడాలని, ఆక్సిజన్ అత్యవసర సమయంలోనే అవసరమనుకుంటేనే వినియోగించాలని అన్నారు.

# కరోనా థర్డ్‌వేవ్ హెచ్చరికలపై సుప్రీం ఆందోళన

### సెకండ్ వేవ్‌నే అడ్డుకోలేకపోయారు.. థర్డ్‌వేవ్‌ను ఎలా ఎదుర్కొంటారు
### కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం కోర్టు



ఢిల్లీ: కరోనా థర్డ్‌వేవ్ హెచ్చరికలపై సుప్రీంకోర్టు గురువారం ఆందోళన వ్యక్తం చేసింది. థర్&థవేవ్‌ను ఎలా ఎదుర్కొంటారని కేంద్రాన్ని ప్రశ్నించింది. దేశంలో కరోనా వ్యాక్సిన్ కొరత కారణంగా చిన్నపిల్లలకు వ్యాక్సినేషన్‌పై కేంద్రం ఒకసారి పునరాలోచించుకోవాలని పేర్కొంది. దీనికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. కాగా దేశంలో కరోనా సెకండ్‌వేవ్ ప్రకంపనలతో ఇప్పటికే దేశం మొత్తం అతలాకుతలమవుతున్న సమయంలో థర్డ్ వేవ్ తప్పదంటూ అత్యున్నత శాస్త్రీయ సలహాదారు డాక్టర్ కే విజయరాఘవన్ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.వేవ్ ఎప్పుడొస్తుంది? ఎలా వస్తుందో స్పష్టత లేనప్పటికీ ముప్పు తప్పదన్నారు. అంతేకాదు థర్డ్ వేవ్ నాటికి వైరస్ మరింతగా మారవచ్చని, భవిష్యత్‌లో మరిన్ని వేవ్‌లు వచ్చే అవకాశం ఎక్కువని తెలిపారు. కొత్త (స్టెయిన్‌ను ఎదుర్కొనేలా వ్యాక్సిన్ తయారు చేసుకోవాలని విజయరాఘవన్ సూచించారు. అయితే ప్రస్తుత వేరియంట్లపై వ్యాక్సిన్ బాగా పని చేస్తోందని తెలిపారు.

గత వారం రోజులుగా 3 లక్షలకు తగ్గకుండా నమోదవుతున్న రోజువారీ కేసులు నేడు మరోసారి నాలుగు లక్షల మార్క్‌ను దాటేసింది. గడిచిన 24 గంటల్లో 4,12,262 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. బుధవారం నాడు 3,980 మంది మృత్యువాతపడ్డారు. ఒకేరోజే 3,29,113 మంది డిశ్చార్జి అయ్యారు. దీంతో మొత్తం కేసుల సంఖ్య 2,10,77,410కు చేరాయి. మృతుల సంఖ్య 2,30,168కు పెరిగింది. ప్రస్తుతం 35,66,398 యాక్టివ్ కేసులున్నాయి. ఇప్పటి వరకు 16,25,13,339 మంది వ్యాక్సిన్ వేయించుకున్నారు.

# ఎన్440కే వైరస్‌పై ఎలాంటి నిర్ధారణ జరగలేదు: పేర్ని నాని

అమరావతి: కరోనా వైరస్ కంటే టీడీపీ అధినేత చంద్రబాబు అత్యంత ప్రమాదకారి అని మంత్రి పేర్ని నాని విమర్శించారు. చంద్రబాబు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు శక్తికి మించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అహర్నిశలు పని చేస్తోందని ప్రశంసించారు. చంద్రబాబు మాత్రం దిగజారుడు



రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏపీలో కొత్త వైరస్ ఉందని అబాండాలు వేస్తున్నారని, ఎన్440కే వైరస్‌పై ఎలాంటి నిర్ధారణ జరగలేదని స్పష్టం చేశారు. దేశంలో దీ.1.617 మినహా కొత్త రకం వైరస్ ఎక్కడా లేదని అన్నారు. రాష్ట్రంలో ఆక్సిజన్, బెడ్స్, రెమిడివిసిర్ అన్నీ అందుబాటులో ఉంచామని తెలిపారు.cసీఎం వైఎస్ జగన్ అన్ని శక్తులను ఒడ్డి కరోనాకు ఎదుర్కొంటుంటే..చంద్రబాబు మాత్రం తన కొడుకు భవిష్యత్తు కోసం కరోనా సమయంలోనూ రాజకీయాలను చేస్తున్నాడు. మన రాష్ట్రం పరువును చంద్రబాబు బయట రా(ష్టాల ముందు తీస్తున్నారు .చంద్రబాబుకు ఈ రాష్ట్రంపై ఎందుకీ కక్ష.?కొడుకు భవిష్యత్తు కోసం ఇంత దిగజారాలా? ప్రభుత్వాన్ని ఎదుర్కోలేక ఇలాంటి రొచ్చు రాజకీయాలు చేస్తున్నారు. బెడ్స్ కాళీ ఉండటం ముఖ్యమా..? కాళీ బెడ్స్ పేషంట్ లకు ఇవ్వడం ముఖ్యమా? నువ్వు దిగిపోయెప్పుడు ఈ రాష్ట్రంలో ఆరోగ్య శాఖ పరిస్థితి ఏమిటి? కనీసం ఒక్క వైరాలజీ లాబ్ పెట్టావా?ఆక్సీజన్ కోసం కేంద్రాన్ని ఒక్కసారైనా ప్రశ్నించావా?c అంటూ చంద్రబాబు తీరును ఎండగట్టారు.సింగపూర్ నుంచి కూడా ఆక్సీజన్ తెప్పిస్తున్నామని, అన్ని రా(ష్టాలు చిన్న వాడైనా జగన్ ని ప్రసంసిస్తుంటే నువ్వు విషం కక్కుతున్నావ్ చంద్రబాబు అంటూ ఫైర్ అయ్యారు. ఇప్పటి వరకు అన్ని విడుతలు కలిపి 67 లక్షల మందికి వాక్సిన్ వేశామని, ఔనూ కూడా వాక్సిన్ వేయడానికి పూర్తి సామర్థం ఉన్న రాష్ట్రం ఏపీ అని చెప్పిందన్న విషయాన్ని గుర్తుచేశారు.

# సంపాదకీయం

శుక్రవారం 07 మే 2021

## మళ్లీ మూడో ఫ్రంట్ సాధ్యమేనా...

రండి మనమంతా కలిసి ప్రాంతీయ పార్టీల కూటమి కడదామంటూ మమత బెనర్జీ పిలుపునిచ్చారు. అంతటి పెద్ద విజయం సాధించిన ఆమెకు లాంఛనంగా అభినందనలు తెలిపిన నాయకులు ఈ విషయంలో మాత్రం కిమ్మనడం లేదు. వాస్తవాలు వారికి తెలుసు. ప్రాంతీయ పార్టీలన్నీ కలిసికట్టుగా జాతీయ కూటమి కట్టడం సాధ్యపడే పని కాదు. ఇరుగుపొరుగు రాష్ట్రాల మధ్య అనేక సమస్యలు. నీటి వనరులు మొదలు , వ్యాపార, రాజకీయ ప్రయోజనాల వరకూ అనేక రకాలైన ఆటంకాలు ఉంటాయి. ఒకే మాట–ఒకే బాటగా కలిసి నడవడం వల్ల ప్రత్యేకించి తమకొచ్చే ప్రయోజనాలేమీ ఉండవు. తమ తమ రాష్ట్రాల్లో నిలదొక్కుకుంటే అదే చాలు అనుకునే నాయకులే ఎక్కువ. అందులోనూ బీజేడీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వంటి ఒకరిద్దరు నేతలు తప్ప అందరూ గురివింద గింజలే. వారిపై కేంద్రం తన దర్యాప్తు సంస్థలతో ఎప్పుడు విరుచుకుపడుతుందో తెలియదు. మరో మూడేళ్ల పాటు ప్రదానిగా మోడీ పదవికేమీ ఢోకా లేని నేపథ్యంలో కొరివితో తలగొక్కునేందుకు ఎవరూ సిద్దం గా లేరు. మమతా బెనర్జీ గెలిచిన ఉత్సాహంతో ఊహా ప్రపంచంలో వ్యాఖ్యలు చేస్తున్నారు తప్పితే కార్యరూపం దాల్చే అంశంగా కనబడటం లేదు. దేశంలో ఇంతవరకూ కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో జాతీయ పార్టీల పాత్ర, ప్రమేయం లేకుండా ఎన్నడూ సాధ్యం కాలేదు. కేంద్ర స్థానంలో నాయకత్వం బాధ్యతలో ఒక జాతీయ పార్టీ ఉంటే దాని చుట్టూ ప్రాంతీయ పార్టీలు జమ కూడతాయి. ఆయా రాష్ట్రాల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ జాతీయ పార్టీ సమన్వయ కర్త పాత్రలో ఉంటుంది. అందువల్ల రాజకీయంగా ప్రాంతీయ పార్టీల నాయకులు తమ రాష్ట్రాల్లో సర్ది చెప్పుకునే ఆస్కారం ఉంటుంది. కాంగ్రెసు, కమ్యూనిస్టు లు కాకుండా ప్రాంతీయ పార్టీలే జట్టు కట్టాలనేది మమత ప్రతిపాదన. వాటిని కూడా కలుపుకుంటే తన రాష్ట్రంలో వాటికి సీట్లు ఇవ్వాల్సి వస్తుంది. పైపెచ్చు మైనారిటీ ఓటు బ్యాంకు వారి నుంచి వచ్చిందే. వారితో కలయిక వల్ల తనకు పెద్దగా ప్రయోజనం ఉండదు. అందుకే ప్రాంతీయ పార్టీలు మాత్రమే కలవాలనేది ఆమె అభిమతం. కానీ ఇరుసు వంటి పెద్ద పార్టీ ఒక్కటి కూడా లేకుండా చక్రం తిప్పాలనుకోవడం అత్యాశే. అందులోనూ నిజంగానే జాతీయ ప్రయోజనాలు ఆశిస్తే వ్యక్తిగత , స్వార్థప్రయోజనాలు మమత పక్కన పెట్టాలి. కానీ ఆ కోణంలో ఆమె ఆలోచిస్తున్న దాఖలాలు లేవు. తనకు ఎప్పటికో ఒకప్పటికి బీజేపీ గండం తప్పదు కాబట్టి జాతీయ స్థాయిలో ఆ పార్టీని ఇరుకున పెట్టాలనేది ఆమె ఆలోచన. ఎన్డీఏ లో బీజేపీని , యూపీఏలో కాంగ్రెసును తమ సారథిగా ప్రాంతీయ పార్టీలు గుర్తిస్తాయి. వాటి వెనక ఉన్న ప్రాతిపదిక, దేశవ్యాప్త విస్తరణ అందుకు కారణం. ఇప్పుడు మమత ప్రాంతీయ పార్టీల కూటమి కడితే ఎవరు నాయకత్వం వహిస్తారనేదే పెద్ద ప్రశ్న. మమత ఆదిపత్య ధోరణి గురించి అందరికీ తెలుసు. ఎక్కడా, ఏ కూటమితోనూ దీర్ఘకాలం కలిసి నడవలేరు. ఆమె అనుకున్నదే జరగాలనుకునే వైఖరి. అందరిని ఒప్పించేంతటి సమన్వయం, సంయమనం ఆమె వద్ద లేవు. చంచలమైన రాజకీయ నిర్ణయాలు, విమర్శలతో దూకుడుగా వ్యవహరిస్తుంటారు. దేశవ్యాప్తంగా ప్రత్యామ్నాయం కావాలనుకుంటున్న కూటమికి ఆమె శైలి ఎంతమాత్రం ఉపకరించదు. ఇప్పటికే డీఎంకే, ఆర్ జెడీ, ఎన్సీపీ, ఏఐడీఎంకే వంటి పార్టీలు ఏదో ఒక కూటమిలో కొనసాగుతున్నాయి. బీజేడీ, టీఆర్ఎస్, టీడీపీ, వైసీపీ వంటి పార్టీలు మమతతో సాగేందుకు సానుకూలంగా లేవు. బీఎస్పీ మాయావతి, సమాజ్ వాదీ పార్టీ అఖిలేష్ లు ఉత్తరప్రదేశ్ లో తమ పునరధికారంపైనే దృష్టి పెట్టాలనుకుంటున్నారు. జాతీయ స్థాయి ఆశలతో కొత్త తలనొప్పులు తెచ్చుకునేందుకు సిద్దంగా లేరు. అన్నిటికంటే మించి మమత ప్రవర్తించే తీరు రాజకీయాల్లో జాతీయ ఐక్యతకు ప్రదాన అవరోధంగా విశ్లేషకులు చెబుతున్నారు. నిజానికి మమతా బెనర్జీ పశ్చిమబెంగాల్ లో గట్టి పోటీనే ఎదుర్కోబోతున్నారు. వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ మాటల్లోనే చెప్పాలంటే గెలుపు సాధించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. బీజేపీ బలహీనతలు తృణమూల్ కు అసెట్ అయ్యాయి. బీజేపీ రాష్ట్ర పార్టీ నాయకుల్లో విభేదాలు, దీదీకి పోటీగా ముఖ్యమంత్రి అభ్యర్థిని చూపించలేకపోవడం, కేంద్ర బలగాల అత్యుత్సాహం , ఎన్నికల కమిషన్ అతి జాగ్రత్తలు వెరసి పశ్చిమబెంగాల్ పై ఢిల్లీ నుంచి దాడి జరుగుతోందన్న భావన ప్రజల్లో ఏర్పడింది. మమతకు తగిలిన గాయమూ సెంటిమెంటును రగిలించింది. ఇంకోవైపు కరోనాను కేంద్రం కట్టడి చేయలేకపోయిందన్న భావమూ, పెట్రోలియం ఉత్పత్తుల ధరలు , మైనారిటీల సంఘటిత ఓటు బ్యాంకు కలగలిసి మమతకు పట్టం గట్టాయి. అయితే వామపక్షాలు, కాంగ్రెసును నామమాత్రం చేసి బీజేపీ పశ్చిమబెంగాల్ లో బలమైన పునాదులు వేసుకోగలిగింది. భవిష్యత్తులో మమతకు బలమైన ప్రత్యామ్నాయమే ఎదురుచూస్తోంది. అందువల్ల సొంత గడ్డపై దృష్టి పెట్టి పటిష్ఠం చేసుకోకపోతే నేలవిడిచి సాము చేసినట్లవుతుంది. అయినా తమ రాజకీయ అవసరాలు, కేసుల కోసం కేంద్రం ముందు సాగిలపడుతున్నప్రాంతీయ పార్టీల నేతలకు కావాల్సింది తమ వారసత్వాలను కాపాడుకోవడమే తప్ప జాతీయ ప్రయోజనాలు కాదు. అందువల్ల మమత పిలుపునందుకుని స్పందించే వారే కరవు అయ్యారు.

# ఆన్ లైన్ లో టెన్త్ స్టూడెంట్స్ బిజీ



గుంటూరు, మే 6, (న్యూస్ పల్స్)కోవిడ్?19 ప్రభావంతో తీవ్రంగా నష్టపోయినవారిలో మొదటి వరుసలో పదోతరగతి విద్యార్థులు ఉంటారు. విద్యా సంవత్సరంలో సగం కరోనాతో పాఠశాలలు మూతపడ్డాయి. మిగతా సగం పూర్తవకముందే మరోసారి మహమ్మారి విరుచుకుపడటంతో ఉన్నపళంగా మే ఒకటో తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముంది. ఆదమరిస్తే ఫలితాలు తారుమారయ్యే ప్రమాదమున్నందున సెలవు రోజుల్లో విద్యార్థులు బడి లేదన్న భావనతో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా జాగ్రత్తగా చదువుకుంటేనే మంచి మార్కులు తెచ్చుకోగలుగుతారని ఉపాధ్యాయులు సలహా ఇస్తున్నారు. కరోనా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇంటిపట్టునే ఉండి మహమ్మారి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 61,589 మంది విద్యార్థులు పరీక్షల రాయటానికి సిద్ధంగా ఉన్నారు. సెప్టెంబర్‌లో 9, 10 తరగతుల విద్యార్థులకు సందేహాల నివృత్తి కోసం పాఠశాలలు తెరచినా డిసెంబర్ నుంచే పూర్తి స్థాయిలో తరగతిలో పాఠాలు చెప్పగలిగే అవకాశం వచ్చింది.

కరోనా కారణంగా కొంత సమయం కోల్పోవడంతో ప్రభుత్వం విద్యా సంవత్సరాన్ని కొంతమేరకు పొడిగించింది. సాధారణంగా మార్చి మూడో వారంలో ప్రారంభం కావాల్సిన పదో తరగతి పరీక్షలను ఈ ఏడాది జూన్ ఏడు నుంచి 16వ తేదీ మధ్య నిర్వహించడానికి షెడ్యూల్ విడుదల చేసింది. విద్యార్థులు పరీక్షలను ఎదుర్కోవడానికి కీలకమైన ఆఖరి నెల రోజులు కరోనా కారణంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించాల్సి రావడంతో వారి చదువుపై తీవ్రంగా ప్రభావం చూపనుంది. పబ్లిక్ పరీక్షల ముందు సన్నాహక పరీక్షలు, సబ్జెక్టుల వారీగా విశ్లేషణ చేసుకోవడం, సందేహాలను నివృత్తి చేసుకోవాల్సిన సమయంలో సెలవులు విద్యార్థులకు ఇబ్బందికరమే అయినా దానిని సరైన ప్రణాళికతో అధిగమించాల్సిన అవసరముంది. సెలవులతో విద్యార్థుల్లో అలసత్వం, అశ్రద్ధ సహజంగానే ఏర్పడతాయి. సంవత్సరమంతా కష్టపడి చదివింది మర్చిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏమాత్రం ఏమరుపాటు ప్రదర్శించినా పిల్లల్లో అలసత్వం వహించి అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉందంటున్నారు. పరీక్షల సమయంలో సాధారణంగా విద్యార్థులు చదివిన పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకుంటూ ఉంటారు. ప్రైవేట్ పాఠశాలల్లో అయితే ఉపాధ్యాయులు విద్యార్థులను రాత్రీపగలు పాఠశాలల్లోనే పుస్తకాలతో కుస్తీ పట్టిస్తారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో విద్యార్థులకు అలాంటి అవకాశం లేదు. సెలవుల కారణంగా విద్యార్థులు చదువులో వెనుకబడకుండా ఉండేందుకు ఉపాధ్యాయులు వాట్సాప్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో ఫోన్‌లో మాట్లాడి సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారు. నమూనా ప్రశ్నపత్రాలను తయారు చేసి వాట్సాప్ గ్రూపుల్లో విద్యార్థులకు చేరవేస్తున్నారు. పలు పాఠ్యాంశాలకు చెందిన వీడియోలను షేర్ చేస్తున్నారు. అనుమానాలను నివృత్తి చేయడానికి ఉపాధ్యాయులు ఫోన్‌లో రికార్డ్ చేసి పిల్లల మొబైల్‌కు పంపుతున్నారు. ఈ సదుపాయాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. సెలవులను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే సబ్జెక్టుల వారీగా విద్యార్థులు పట్టు సాధించవచ్చని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.


# ఆన్ లైన్ లో విద్యుత్ సేవలు

విజయవాడ, మే 6, (న్యూస్ పల్స్)విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేయడం మొదలుకుని.. కట్టే బిల్లుల వరకూ అన్ని సేవలనూ ఆన్‌లైన్‌లోనే జరిపేందుకు అవసరమైన మార్పులు తేవాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచిస్తోంది. కరోనా వంటి కష్టకాలం వచ్చినా ఈ తరహా విధానం శ్రేయస్కరమని పేర్కొంది. దీనివల్ల విద్యుత్ వినియోగదారుల హక్కులకు తగిన భద్రత పెరుగుతుందని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల విద్యుత్ సంస్థలకు గతేడాది పంపించింది. కనెక్షన్ కోసం దరఖాస్తు, వాటి మంజూరు, డిస్కమ్ పరిధిలో ఉండే కనెక్షన్ల వివరాలన్నీ వెబ్‌సైట్‌లో ఉండాలి. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసేలా ఏర్పాట్లు చేయాలి. దీనివల్ల జవాబుదారీతనం పెరుగుతుందని సూచించింది. అవసరమైతే డిస్కమ్‌లు మొబైల్ యాప్‌లను అందుబాటులోకి తేవాలి. కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. మెట్రో సిటీల్లో 7 రోజుల్లో, మునిసిపాలిటీల్లో 15 రోజుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 30 రోజుల్లో కనెక్షన్ ఇవ్వాలి. వినియోగదారుల ఇళ్లు లేదా వ్యాపార సంస్థలకు స్మార్ట్, ప్రీపెయిడ్ మీటర్లు అమర్చాలి. ప్రీపెయిడ్ సర్వీస్ తరహాలో ముందే డబ్బులు చెల్లించే విధానం ఇందులో ఉంటుంది. స్మార్ట్ మీటర్ల వల్ల ఆన్‌లైన్ ద్వారానే వినియోగం, సేవలు, నాణ్యత తెలుసుకోవచ్చు. మీటర్లను వినియోగదారులే కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఇవ్వాలి. ఇలాంటి మీటర్లను ఏపీఈఆర్‌సీ గుర్తించిన సంస్థ చేత ఎలాంటి ఫీజు తీసుకోకుండా పరీక్షించాలి. మీటర్ రీడింగ్, బిల్లింగ్ ప్రక్రియ మొత్తం వినియోగదారుడికి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలి. డిస్కమ్‌లు బిల్ వివరాలను వినియోగదారుడికి ఎస్ఎంఎస్ ద్వారా పంపాలి. రూ.వెయ్యి దాటిన బిల్లును ఆన్‌లైన్ ద్వారా చెల్లించే ఏర్పాటు చేయాలి. బిల్లు కట్టలేదని సరఫరా నిలిపివేస్తే, బిల్లు చెల్లించిన వెంటనే పునరుద్ధరించాలి. లేనిపక్షంలో సంబం ధిత డిస్కమ్ జరిమానా చెల్లించాలి. తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీ పెయిడ్ మీటర్లు బిగించాలి. ఇప్పటికే ఈ దిశగా డిస్కమ్‌లు అడుగులు వేస్తున్నాయి. క్రమంగా అన్ని వర్గాల వినియోగదారులకు విస్తరింపజేయాలి. వ్యవసాయ విద్యుత్ మినహా.. వినియోగదారులందరికీ 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయాలి. విద్యుత్ అంతరాయాలను విధిగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలి. దీనికోసం సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ డ్యూరేషన్ ఇండె క్స్, సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ ఫ్రీక్వెన్సీ ఇండెక్స్‌ను అనుసరించాలి. వినియోగదారుల ఫిర్యాదులు, పరిష్కారం కూడా పారదర్శకంగా ఉండాలి. నాణ్యమైన సేవలు అందించని పక్షంలో డిస్కమ్‌లు వినియోగదారులకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఇవన్నీ సక్రమంగా అమలయ్యేందుకు వీలుగా ఫిర్యాదుల విభాగాన్ని బలోపేతం చేయాలి.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ అడుగులు

విశా?ఖపట్టణం, మే 6, (న్యూస్ పల్స్)కేంద్రంలోని మోడీ సర్కార్ ఒక కఠినమైన నిర్ణయం తీసుకుంది. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ పరం చేసి భారం వదిలించుకోవాలన్నదే ఆ నిర్ణయం. దీని మీద ఎంత మంది ఎన్ని రకాలుగా ఆందోళనలు చేస్తున్నా కూడా కేంద్రం కరగడంలేదు. పైగా పదే పదే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ఇది కేంద్ర ప్రభుత్వ సంస్థ అని. తమ సంస్థను తాము ఏం చేసుకున్నా తప్పేం లేదని కూడా వాదిస్తున్నారు. ఆంధ్రుల కోడలుగా మీరు ఇలాంటి పని చేయడం మంచిది కాదు అని రాజ్యసభలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చెప్పినా కూడా అదే సభలో ఉన్న నిర్మలాసీతారామన్ నుంచి కనీస స్పందన కానరాలేదు. దేశంలో సెకండ్ వేవ్ కరోనా పెద్ద ఎత్తున వ్యాపించింది. ఈసారి కరోనా లక్షణాలలో భారీ తేడా ఉంది. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధమైన సమస్యలు వస్తున్నాయి. దాంతో ఆక్సిజన్ కి డిమాండ్ పెద్ద ఎత్తున వస్తోంది. చాలా చోట్ల ఆక్సిజన్ కొరతతో కరోనా రోగులు మరణిస్తున్నారు. అటువంటి వేళ అతి పెద్ద ఆక్సిజన్ ప్రోడక్షన్ సెంటర్ గా విశాఖ స్టీల్ ప్లాంట్ నిలవడం విశేషం. గత ఏడాది కూడా విశాఖ ఉక్కు కర్మాగారం పెద్ద ఎత్తున మెడికల్ ఆక్సిజన్ ని తయారు చేసి దేశానికి అందించింది. ఎనిమిది వేల టన్నులకు పైగా విశాఖలో ఆక్సిజన్ నాడు జాతికి లభించింది. అయితే నాటి కంటే ఇపుడు డిమాండ్ ఎక్కువగా ఉంది. విశాఖ ఉక్కు కర్మాగారం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంది. దాంతో గరిష్టంగా ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తూ దాన్ని ప్రభుత్వానికి చాలా వీలుగా అందచేస్తోంది. అదే ప్రైవేట్ పరం అయితే ఈ వీలు కానీ వెసులుబాటు కానీ ఉంటుందా అన్న చర్చ అయితే ఉంది. దేశానికి ఊపిరి పోస్తూ ఒక విధంగా పునర్జన్మని విశాఖ స్టీల్ ప్లాంట్ అందిస్తోంది అంటున్నారు. ఈ విషయంలో తమకు చాలా గర్వంగా ఉందని కార్మికులు, యూనియన్ నాయకులు కూడా అంటున్నారు. ఇంతలా సేవ చేస్తూ ఉక్కు ఉత్పత్తుల్లో కూడా లాభాల బాటలో ఉన్న తమ పరిశ్రమను ప్రైవేట్ పరం చేయడం తగునా అన్నదే వారి నుంచి వస్తున్న ప్రశ్న. దేశానికి అక్సిజన్ అందిస్తూంటే విశాఖ ఉక్కు కర్మాగారం గొంతు నులమడానికి చూడడం న్యాయమా అని కార్మిక లోకం గట్టిగానే నిలదీస్తోంది. ఊపిరి పోస్తున్న తమ ఉసురు తీయడానికి చూడడం న్యాయమా అని కూడా నిలదీస్తున్నారు. ఈ మధ్యనే విశాఖలో అతి పెద్ద కార్మిక సభ కూడా జరిగింది. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఎలాగైనా తాము కాపాడుకుంటామని కూడా అఖిల భారత కార్మిక నాయకులు శపథం చేశారు. లాభాలతో పాటు దేశానికి ఆక్సిజన్ గనిగా ఉన్న విశాఖ ప్లాంట్ అవసరం ఏంటో ఇపుడు దేశానికి కరోనా వేళ బాగా తెలిసివచ్చిందని కూడా వారు అంటున్నారు. మొత్తానికి అందరికీ విశాఖ ఉక్కు విలువ, గొప్పతనం తెలుసు. కరోనా సెకండ్ వేవ్ వేళ విశాఖ స్టీల్ అందిస్తున్న సేవలు చూసి అయినా మోడీ సర్కార్ మనసు మార్చుకుంటుందా అన్నదే ఇక్కడ ప్రధానమైన ప్రశ్న.

# పవన్ రూట్ మార్పు



కాకినాడ, మే 6, (న్యూస్ పల్స్)పవన్ కల్యాణ్ కు అసలే రాజకీయంగా ఇబ్బందులు ఎక్కువ. ఇక పొరుగున ఉన్న తమిళనాడు ఎన్నికల ఫలితాలు మరింత ఇబ్బందిపెట్టాయి. కమల్ హాసన్ పార్టీ అక్కడ ఒక్క సీటును కూడా దక్కించుకోకపోవడం పవన్ కల్యాణ్ అభిమానులను నిరాశ పర్చింది. కమల్ హాసన్ రాజకీయాల్లోకి రావడాన్ని పవన్ కల్యాణ్ స్వాగతించారు. మార్పు కోసం అందరూ రాజకీయాల్లోకి రావాల్సిందేనని పవన్ కల్యాణ్ అన్నారు. సినీ హీరోలకు ప్రజల ఆమోదం లభించదని మరోసారి కమల్ హాసన్ ఓటమి ద్వారా స్పష్టమయింది. సినీగ్లామర్ కేవలం గ్రౌండ్, స్క్రీన్ లకే పరిమితమవుతుందని, పోలింగ్ కేంద్రాల వరకూ అది రాదని తేలిపోయింది. దీంతో పవన్ కల్యాణ్ మరోసారి పునరాలోచనలో పడినట్లు తెలిసింది. నిజానికి పవన్ కల్యాణ్ కు కమల్ హాసన్ మాదిరిగానే వీరాభిమానులున్నారు. లక్షలాది మందిద అభిమానులతో పాటు సామాజికపరమైన మద్దతు కూడా పవన్ కల్యాణ్ కు ఉంది. కానీ గత ఎన్నికల్లో ఘోర ఓటమిని పవన్ కల్యాణ్ చూడాల్సి వచ్చింది. ఒంటరిగానే పోటీ చేయడం వల్లనే ఓటమి పాలయ్యాయని పవన్ కల్యాణ? తన సన్నిహితుల వద్ద అభిప్రాయపడ్డారు. కమల్ హాసన్ కూడా ఒంటరిగానే పోటీ చేసి భంగపడ్డారు. సినీ గ్లామర్ ను మరింత పెంచుకోవడం, పార్టీ కోసం నిధులను కూడబెట్టడం కోసమే పవన్ కల్యాణ? సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చారు. అయితే డబ్బుల సంగతి పక్కన పెడితే సినీగ్లామర్ పనిచేయదన్నది స్పష్టమయింది. తాను గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవాలన్న ప్రయత్నంలో పవన్ కల్యాణ్ ఉన్నారు.

## అందరి చూపు..నాదెండ్ల వైపే

విజయవాడ, మే 6, (న్యూస్ పల్స్)జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కేవలం ఒక్కరిపైనే ఆధారపడుతున్నారు. ఆయనకు అన్నింటా అధికారాలు ఇచ్చారు. దీంతో జనసేన పార్టీ నేతల్లో అసహనం వ్యక్తమవుతుందంటున్నారు. అందుకే జనసేనను వరసపెట్టి నేతలు విడిచిపోతున్నారన్న టాక్ పార్టీలో బలంగా విన్పిస్తుంది. ఇప్పుడు నాదెండ్ల మనోహర్ టార్గెట్ గా సోషల్ మీడియాలో కొందరు పోస్ట్ లు పెడుతుండటం చర్చనీయాంశంగా మారింది. నాదెండ్ల మనోహర్ వివాదాలకు దూరంగా ఉండే నేత. నిజానికి నాదెండ్ల మనోహర్ వైసీపీలో చేరాల్సి ఉంది. వైసీపీలో అవకాశం లేకపోవడంతో టీడీపీలో చేరాలనుకున్నారు. కానీ టీడీపీలో తనకు పోటీ దారులు ఎక్కువగా ఉండటంతో ఆయన జనసేనను ఎంచుకున్నారు. పవన్ కల్యాణ్ కు నమ్మకమైన వ్యక్తిగా మారారు. దీంతో పవన్ కల్యాణ్ నాదెండ్ల మనోహర్ ను రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ గా నియమించారు. పవన్ కల్యాణ్ కు చరిష్మా ఉండటం ఆయన ఎక్కువగా జనంలోకి వెళితే ఇబ్బందులు తలెత్తుతాయని భావించి నాదెండ్ల మనోహర్ కే ఎక్కువ పనులను అప్పగిస్తున్నారు. వివిధ జిల్లాల బాధ్యతలను కూడా నాదెండ్ల మనోహర్ చూసుకుంటున్నారు. జనసేన ఏకైక ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ పార్టీ పై అసంతృప్తి వ్యక్తం చేయడానికి నాదెండ్ల మనోహర్ కారణమంటున్నారు. తనకు నాదెండ్ల సరైన గౌరవం ఇవ్వలేదని పలుమార్లు ఆయన ఆరోపించారు. ఇక జేడీ లక్ష్మీనారాయణ నుంచి మొన్నటి మాదాసు గంగాధరం వరకూ వరసగా పార్టీని వీడి వెళ్లిపోయిన నేతలందరూ తమ వేళ్లను నాదెండ్ల మనోహర్ వైపే చూపుతున్నారు. పవన్ కల్యాణ్ నాదెండ్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, ఇతర నేతలతో కలసి సమస్యలపై చర్చించక పోవడంతోనే ఈ ఇబ్బంది ఎదురయిందంటున్నారు. మొత్తం మీద సోషల్ మీడియాలో నాదెండ్ల మనోహర్ జనసైనికులకు టార్గెట్ గా మారుతున్నారు.

## స్మార్ట్ ఫోన్లు తో ...అన్నింటికి దూరం

విజయవాడ, మే 6, (న్యూస్ పల్స్)రాత్రి వేళ కరెంట్ పోతే కొవ్వొత్తి వెలిగించేందుకు అగ్గిపెట్టె ఎక్కడా అని ఇప్పుడు ఇంట్లో వెతకడం లేదు.. పక్క వ్యక్తి టైం ఎంత? అంటే ఎవరూ ముంజేతిని చూసుకోడం లేదు. ఈవేళ ఏ వారమని అనుమానం వస్తే ప్యాకెట్ క్యాలెండర్ చూడడం లేదు. స్మార్ట్ ఫోన్. స్మార్టుగా ఇంట్లోకి దూరి ఎన్నో వస్తువులను దూరం చేసింది. ఆడుకునే ఆటబొమ్మలు మాయం అయ్యాయి. బంధువుల యోగక్షేమాలు తెలిపే ఉత్తరాలు దాదాపు శుభలేఖలకే పరిమితమైపోయాయి. సుందర దృశ్యాలు బంధించే కెమేరాలు, జ్ఞాపకాలను పదిలంగా ఉంచే ఫొటో ఆల్బమ్‌లు అరుదుగా కనిపిస్తున్నాయి. టార్చ్‌లైట్, వాచ్, అలారం, క్యాలెండర్, కాలిక్యులేటర్, కెమెరా, రేడియో, ఆడియో ప్లేయర్, రికార్డర్, డిక్షనరీ, పుస్తకాలు, గేమ్స్, లేఖలు ఇలా ఎన్నో వస్తువుల అవసరాన్ని స్మార్ట్ ఫోన్ తీరుస్తోంది. సుప్రభాతం వినిపించే రేడియోలు మాయమయ్యాయి. సంగీతంతో ఉత్సాహాన్ని నింపే టేప్ రికార్డులు చూద్దామన్నా లేవు. కాలక్షేపంగా ఎవరి చేతిలోనూ పుస్తకాలు కనిపించడం లేదు. చిన్నపిల్లలు రోజంతా స్నేహితులతో కలసి ఉల్లాసంగా ఆటలాడుకునే వారు. ఈ ఆటలతో వారికి శారీరక వ్యాయామంలా మారి ఆరోగ్యకరంగా ఉండేవారు. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు వచ్చాక చిన్నారులు ఆటలకు దూరం అయ్యారు. ఇంట్లోనే ఒక మూలన కూర్చుని గేమ్స్ ఆడుతూ కనిపిస్తున్నారు. పెద్దవారు ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకునే వారు. ఇప్పుడు పక్కన ఎవరున్నారన్న విషయం గుర్తించక స్మార్ట్‌ఫోన్ యాప్‌లతో గడిపేస్తున్నారు. ఏమైనా పుస్తకాలు, నవలు, కథలు చదవాలంటే గ్రంథాలయానికో, లేక అద్దెకు ఇచ్చే దుకాణాలకు వేళ్లేవారు. రోజుకింత అద్దె చెల్లించి పుస్తకాన్ని తెచ్చుకుని చదివి తిరిగి ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పుస్తకాలు స్మార్ట్‌ఫోన్‌లో ప్రత్యేక్షమవుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఏ పుస్తకం కావాలన్నా పీడీఎఫ్ రూపంలో లభిస్తుంది. దాన్ని ఎంచక్కా డౌన్‌లోడ్ చేసుకుని చదివేసుకోచ్చు. ఒకప్పుడు పుస్తకం హస్తాభరణం అనేవారు. కానీ ఇప్పుడు స్మార్టు ఫోన్ ఆ అవసరాన్ని భర్తీ చేసింది. యువతీ యువకుల వద్ద స్మార్టుఫోన్ లేకపోతే అవమానంగా భావిస్తున్నారు. ఇప్పుడు వారికి అవసరమైన పుస్తకాలను సైతం ఆన్‌లైన్‌లోనే చూసుకుంటున్నారంటే అతిశయోక్తికాదు. ఒకప్పుడు ఎవరైనా బాగా చదువుతున్నాడంటే అతని ఆచూకీ కోసం ముందుగా లైబ్రరీకి వెళ్లేవారు. ఇప్పుడు తలవంచుకుని స్మార్టు ఫోన్‌వైపు చూస్తున్నారు. చిన్నపిల్లలకు ఎదైనా ఇంగ్లీష్ పదం అర్థం కాకపోతే డిక్షనరీలో వెతికేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వెంటనే మొబైల్ డిక్షనరీ చూసుకుంటున్నారు.

## సామాజిక వర్గంలో లోకేష్ కు చిక్కని పట్టు

విజయవాడ, మే 6, (న్యూస్ పల్స్)ప్రధాన ప్రతిపక్షం టీడీపీలో ఒక చిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. పార్టీ అధినేత చంద్రబాబు కుమారుడు, మాజీ మంత్రి లోకేష్‌ను సొంత సామాజిక వర్గానికి చెందిన కమ్మ నాయకులు ఎవరూ పట్టించుకోవడం లేదని సీనియర్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఎవరూ దాచకుండా బహిరంగ వేదికలపైనే చెబుతుండడం ఆసక్తిగా మారింది. ఇది ఇప్పటి నుంచి ఉన్నది కాదు? పార్టీ అధికారంలో ఉన్నప్పుడు లోకేష్ మంత్రిగా ఉన్నప్పటి నుంచే చాలా మంది కమ్మ నేతలు లోకేష్‌పై అసహనంతోనే ఉన్నారు. అయితే పార్టీ అధికారంలో ఉండడం? లోకేష్ మంత్రిగా ఉండడంతో ఎవ్వరూ బయటపడలేదు. పార్టీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోవడం.. ఆ తర్వాత లోకేష్ సైతం ఓడిపోయినప్పటి నుంచి లోకేష్ పార్టీని వీడుతున్న వాళ్లకు, పార్టీలో ఉన్న కమ్మలకు గట్టిగా టార్గెట్ అయిపోతున్నాడు. గతంలో టీడీపీలో గెలిచిన గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ సైతం.. లోకేష్‌పై తీవ్రవ్యాఖ్యలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీనియర్లు గుర్తు చేస్తున్నారు. “మాలో చాలా మందికి ఆయనపై సంతృప్తి లేదు. అలాగని బయటపడలేం“ అని రాజమండ్రికి చెందిన ఒక సీనియర్ మోస్ట్ వ్యాఖ్యానించారు. ఇక, సీమకు చెందిన కమ్మ నాయకులు, ఏకంగా ఓ కుటుంబం కూడా లోకేష్‌ను పట్టించుకోవడం లేదు. ఆయనను పూచిక పుల్లను తీసి పారేసినట్టు పారేస్తోంది. ఇక, కోస్తాంధ్రకు చెందిన వారు కూడా లోకేష్ కు ఎక్కడా విలువ ఇవ్వడం లేదు. “ఆయన వల్ల మాకేం ఒరిగింది. అధికారంలో ఉన్నప్పుడు అంతా నేనే అన్నట్టుగా వ్యవహరించాడు. కనీసం.. మేం చేసుకునే వ్యాపారాలను కూడా పట్టించుకోకుండా.. నాకేంటి .. అనే ధోరణిలోనే వ్యవహరించారు“ అని కృష్ణాకు చెందిన కమ్మ నేతలు వాపోతున్న పరిస్థితి. పార్టీలో యువ కమ్మ నేతలకు కూడా లోకేష్‌పై గురి లేదు. లోకేష్‌ను నమ్ముకుంటే భవిష్యత్తు లేదనే వారి పార్టీ వీడి వెళ్లిపోతున్నారు. ఇందుకు కరణం వెంకటేష్, దేవినేని అవినాషే ఉదాహరణ. ఈ పరిణామాలను బట్టి ఇప్పటికిప్పుడు లోకేష్‌పై వీరిలో వ్యతిరేకత వచ్చిందని చెప్పలేం. ఆయనపై అధికారంలో ఉన్న నాటి నుంచి ఈ వర్గం దూరంగానే ఉన్నారని తెలుస్తోంది. మంత్రిగా ఉన్న సమయంలోనే లోకేష్ తన పంచాయితీరాజ్ శాఖకి సంబంధించి.. కమిషన్ కోసం బేరం పెట్టారని.. గుంటూరుకు చెందిన కమ్మ మాజీ ఎమ్మెల్యే ఒకరు ఇటీవల బరస్ట్ అయ్యారంటే.. లోకేష్‌పై నేతల్లో ఏ రేంజ్‌లో కసి ఉందో అర్థమవుతోంది. ఇక, మంగళగిరిలో ఆయన ఓడిపోయిన విషయం తెలిసిందే. కానీ, ఆయన ఓడిపోవాలని కోరుకున్న వారు కూడా ఉన్నారని తెలిస్తే.. ఆశ్చర్యం అనిపించకమానదు.

# రెండు వారాల పాటు కఠిన ఆంక్షలు...

## ఆర్డిఓ రామకృష్ణా రెడ్డి

తుగ్గలి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు వారాల పాటు కఠిన ఆంక్షలను అమలు చేస్తున్నట్టు ఆదోని ఆర్డిఓ రామకృష్ణ రెడ్డి తెలియజేశారు.గురువారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలో అమలవుతున్న కర్ఫ్యూ మరియు 144 సెక్షన్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన తుగ్గలిలో ఎమ్మార్వో నిజాముద్దీన్,ఎస్సై నాగేంద్ర ఆధ్వర్యంలో కర్ఫ్యూను పరిశీలించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపల ప్రజలు మరియు వాహనదారులు తమ గమ్య స్థానాలకు చేరుకోవాలని తెలియజేశారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు అవుతుందని తెలియజేశారు.కోవిడ్ నివారణ చర్యల్లో భాగంగా 12 గంటల తర్వాత ప్రజలు ఎవరు బయటికి రాకుండా ఇళ్ళల్లోనే ఉండి జాగ్రత్త పడాలని ఆయన తెలియజేశారు.కోవిడ్ ఆంక్షలను దిక్కరించిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.మండల అధికారుల ద్వారా మండల వ్యాప్తంగా అమలవుతున్న కర్ఫ్యూ సంబంధిత విషయాలను ఆర్డివో రామకృష్ణారెడ్డి ఆరా తీశారు.కర్ఫ్యూ సమయంలో పాటించవలసిన నియమ నిబంధనలను ఆర్డీవో అధికారులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి తహసిల్దార్ నిజాముద్దీన్,తుగ్గలి ఎస్సై నాగేంద్ర,ఆర్.ఐ సుధాకర్ రెడ్డి,వీఆర్వో నాగేంద్ర, గ్రామ సచివాలయ సిబ్బంది,వీఆర్ఏ లు,తుగ్గలి పోలీస్ సిబ్బంది మరియు తుగ్గలి రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ శాఖలు..హూళక్కే

విజయవాడ, మే 6, (న్యూస్ పల్స్)జగనన్న విద్యాదీవెన' పథకం కింద 2020?21 ఫీజు రీయింబర్స్‌మెంట్ మొదటి విడత నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆన్‌లైన్ ద్వారా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. అయితే.. ఈ నిధుల్లో ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన సొమ్ములు ఏమైనా ఉన్నాయా ? అంటే.. లేవు. వివిధ సామాజిక వర్గాల సంక్షేమం కోసం.. కేటాయించే నిధులనే గుండుగుత్తుగా చూపించి.. వీటినే విద్యాదీవెన కింద విడుదల చేశారు. దీనిపై ఇప్పుడు ఆయా సంక్షేమ శాఖలకు చెందిన ప్రజలకు లబోదిబోమంటున్నారు. మాకు కేటాయించిన నిధులు విద్యార్థులకు ఎలా ఇస్తారని.. ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇలాంటి ప్రశ్నలే తెరమీదకి వస్తున్నాయి.రూ.491.42 కోట్లు (బీసీ విద్యార్థులతో పాటు ఈబీసీ, కాపు విద్యార్థులకు), ఎస్సీ సంక్షేమ శాఖ రూ. 119.25 కోట్లు (ఎస్సీ విద్యార్థుల కోసం), ఎస్టీ సంక్షేమ శాఖ రూ.19.10 కోట్లు(ఎస్టీ విద్యార్థుల కోసం), మైనారిటీ సంక్షేమ శాఖ రూ.41.68 కోట్లు(మైనార్టీ విద్యార్థుల కోసం) కేటాయించారు. వాస్తవానికి ఈ నిధులు వ్యక్తిగతంగా ఆయా శాఖల ద్వారా ఆయా సామాజిక వర్గాల అభ్యున్నతికి వెచ్చించాలి. కానీ, ఇప్పుడు ప్రభుత్వం వీటినే విద్యాదీవెన కింద జమ చేస్తుండడం గమనార్హం. అంటే.. ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఆయా శాఖలకు కేటాయించిన నిధులు లేవన్న మాట.దీనిపై ఆయా సామాజిక వర్గ ప్రజలనుంచి జగన్ పై వ్యతిరేకత వస్తోంది. "ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయినా.. మా సామాజిక వర్గాలకు ప్రత్యేకంగా చేసింది ఏమీ లేదు. గత ఎన్నికల సమయంలో మాకు కమ్యూనిటీ హాళ్లు కట్టిస్తామన్నారు. ఈ ప్రతిపాదన ఇప్పటికీ సాకారం కాలేదు. ఇతర పథకాలకు కూడా నిధులు ఇవ్వడం లేదు. ఇప్పుడు కేవలం సామాజిక పథకాలకు కేటాయించడం ఏమేరకు సరైంది?" అని వారు ప్రశ్నిస్తున్నారు. గతంలో చంద్రబాబు ఉన్నప్పుడు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే సామాజిక వర్గాలకు కేటాయించిన నిధులను వారికే వెచ్చించారు.కానీ, ఇప్పుడు జగన్ వాటికి కేటాయించిన నిధులను కూడా ఇతర పథకాలకు ళ్లిస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. మరి దీనిపై ఏమంటారో చూడాలి.

# గంజాయి ముఠా అరెస్టు

కడప పేద, మధ్యతరగతితో పాటు యువ తను టార్గెట్ చేసుకుని గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 16 కేజీల గంజాయిని కడప జిల్లా పోలీసులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఓఎస్డీ దేవప్రసా ద్, కడప డీఎస్పీ సునీల్, చిన్నచౌకు సీఐ అశోక్రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలను వెల్లడించారు. మైదుకూరు టౌన్ సాయినాధపురానికి చెందిన చీమల జనార్ధన్రెడ్డి కర్నూలు జిల్లా చాగలమర్రి టౌన్ శ్రీనివాసనగర్కు చెందిన సున్నం రామసుబ్బయ్య, ఒంటిమిట్ట మండలంలోని రైల్వేస్టేషన్ అరుంధతీకాలనీకి చెందిన మిణుకు రవిశంకర్, కమలాపురం టౌన్ దర్గా వీధికి చెందిన సోమేసుల నాగార్జున సాగర్, అదే ప్రాంతానికి చెందిన సోమే సుల వెంకటలక్షుమ్మలు అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారన్నారు. వీరు విశాఖపట్టణం ఏజన్సీ ఏరియా నర్సీ పట్నానికి చెందిన సత్తిబాబు ద్వారా గంజాయిని లారీలలో తీసుకువచ్చి జిల్లాలోని కొంతమందికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు.వీరు పేద, మధ్యతరగతికి చెందిన వారితో పాటు విద్యార్థులను టార్గెట్ చేసుకుని గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపారు. కడప డీఎస్పీ సునీల్ ఆధ్వర్యంలో చిన్నచౌకు సీఐ అశోక్రెడ్డి,ఎస్ఐలు అమర్నాధరెడ్డి, సత్యనారాయణ సిబ్బందితో నిఘా ఉంచి ఈ ఐదుమం దిని దేవునికడప రోడ్డులోని ఆర్చి వద్ద అరెస్టు చేశారని తెలిపారు. వారి వద్ద నుంచి 16 కేజీల గంజాయి, సెల్ఫోను, రూ.250 నగదు స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న విశాఖకు చెందిన సత్తిబాబు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. త్వరలో అతడిని కూడా అరెస్టు చేస్తామన్నారు. గంజాయి రవాణా చేస్తున్న వారిని అరెస్టు చేసిన సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# రంపచోడవరంలో కట్టుదిట్టంగా కర్ఫ్యూ

ఏలూరు తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం లో కర్ఫ్యూని కట్టుదిట్టమైన ఏర్పాట్లతో నిర్వహించారు. పాక్షిక కర్ఫ్యూ రంపచోడవరంలో విజయవంతంగా జరుగుతుంది. అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. రంపచోడవరం ఎఎస్పీ బిందు మాధవ్ రంగంలోకి దిగారు కర్ఫ్యూ సమయంలో రోడ్లపై తిరుగుతున్న వారిపై కోవిడ్ పట్ల అవగాహన కల్పించి మాస్క్ ధరించడం పట్ల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రజల్లో మార్పు వచ్చిందని, వ్యాపారాలు కూడా స్వచ్ఛందంగా దుకాణాలు మూసి వేస్తున్నారని, ఇదే విధంగా అందరూ బాధ్యతగా వ్యవహరిస్తే కోవిడ్ ఎదుర్కోవడం సులభతరంగా అవుతుందని అన్నారు. అంతే కాకుండా ఇప్పటికే ప్రజలు కు కరోనా అంటే భయంతో ఉన్నారని, అందుచేత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతియుతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనాథ్ ఎస్సై దుర్గాప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు

# కర్ఫ్యూ ఆంక్షలు ఉల్లంఘిస్తే ఐపీసీ 188 సెక్షన్ కింద కేసులు నమోదు

## సిఐ నరసింహారావు హెచ్చరిక

నెల్లూరు ఏపీలో తొలి రోజు కర్ఫ్యూ మే 5, బుధవారం కర్ఫ్యూ మొదలైంది .ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు దుకాణాలు తెరిచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 12 గంటల తర్వాత అన్నీ బంద్ అయ్యాయి. మ.12 నుంచి తర్వాతి రోజు ఉదయం 6గంటలకు అంటే 18గంటల పాటు కర్ఫ్యూ అమల్లో ఉంటుంది. 2 వారాల పాటు కర్ఫ్యూ అమల్లో ఉంటుంది. ఈ తరుణంలో వా కాడు సిఐ నరసింహ రావు కోట,వాకాడు,చిట్టమూరు,ఓజిలి మండల కేంద్రలాలో ఆయా మండల ఎస్సైలు,పోలీసు సిబ్బంది తో కలిసి దుకాణ దారులకు కర్ఫ్యూ, మాస్క్ లు,సానిటీజర్ వినియోగం, సెక్షన్188,144 లపై అవగాహన కల్పించారు.కోట పట్టణంలో సిఐ విస్తృతంగా పర్యటించి, వ్యాపారస్తులకు పలు విషయాలు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ఫ్యూ సమయంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని హెచ్చరించారు. అందరూ ఇంట్లోనే ఉండాలని సూచించారు. అత్యవసర సేవలు మినహా మిగతావారు బయటకు రాకూడదన్నారు. కర్ఫ్యూ ఆంక్షలు ఉల్లంఘిస్తే ఐపీసీ 188 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. అంతేకాదు బండి కూడా సీజ్ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. కాగా, వ్యాక్సిన్ తీసుకునే వారికి మినహాయింపు ఉంటుందన్నారు.ఏపీలో రోజురోజుకి కరోనా కేసులు పెరిగిపోతున్నాయి. రికార్డు స్థాయిలో కేసులు, మరణాలునమోదవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కరోనాను కట్టడి చేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది అని, ఇందులో భాగంగానే 18గంటల పాటు రాష్ట్రవ్యాప్త కర్ఫ్యూ విధించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది అని ఆయన చెప్పారు. అందులో భాగంగానే వాకాడు సర్కిల్ పరిధిలోని అన్నీ మండల ,గ్రామీణ ప్రాంతాల్లో మ.12 తర్వాత ఆర్టీసీ బస్సులే కాదు ప్రైవేట్ వాహనాలు కూడా నిలిపి వేయడం జరిగిందని తెలిపారు. ప్రజా రవాణ పూర్తిగా నిలిచింది. ఆటోలు, ట్యాక్సీలు అన్నీ బంద్ అయ్యాయి. అనవసరంగా బయటకు వస్తే పోలీసులు కేసులు పెడతారు. సో, పనులేమైనా ఉంటే మ.12లోపే పూర్తి చేసుకోవడం బెటర్ అన్నారు.ముఖ్యంగా వ్యాపస్తులు వారి దుకాణాలలో ఉన్నప్పుడు మాస్క్ లు ముక్కనోటి క్రిందకు పెట్టుకుంటున్నారు అని,దాని వలన ఉపయోగం లేదు అన్నారు,మాస్క్ లు తప్పనిసరిగా నోరు,ముక్క ముసుకొనే విధంగా ధరించాలి అన్నారు.అదేవిధంగా సానిటీజర్ ను కూడా విధిగా వాడాలి అన్నారు, అదేవిధంగా కరోనా సోకిన పేషంట్లు బజార్లకు వచ్చి సరుకులు కొనుగోలు చేస్తున్నారు

# ఒడిశాతో జగన్ స్నేహహస్తం

శ్రీకాకుళం, మే 6, (న్యూస్ పల్స్)జగన్ రైతు కాదు, ఆ మాటకు వస్తే ఆయన తండ్రి వైఎస్సార్ కూడా రైతు కాదు. కానీ వారిద్దరికీ రైతుల పట్ల వారి సమస్యల పట్ల మాత్రం మంచి అవగాహన, చిత్తశుద్ధి ఉంది. అదే సమయంలో రైతులకు ఏదో మేలు చేయాలన్న తాపత్రయం విషయంలో జగన్ వైఎస్సార్ ఇద్దరూ ఇద్దరే అని చెప్పాలి. ఇక విభజన ఏపీలో ఎక్కువగా వ్యవసాయం మీదనే ఆదాయం లభిస్తోంది. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనుకున్నా కూడా అడుగులు ముందుకు పడడంలేదు. అదే సమయంలో సమృద్ధిగా ఉన్న జలవనరులను వాడుకోవడం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలన్న కోరిక మాత్రం జగన్ కి ఉంది.శ్రీకాకుళం జిల్లా ఏపీలోనే చిట్ట చివరిది. వెనకబాటుతనంలో ముందుంటుంది. ఇక్కడ అతి పెద్ద జీవనది వంశధార. ఇది ఒడిషాను కలుపుతూ ఉంటుంది. వంశధారం మీద ఏ ప్రాజెక్ట్ చేపట్టాలన్నా కూడా ఒడిషా అనుమతి కావాలి. సహజంగా పొరుగు రాష్ట్రం అభ్యంతరం వ్యక్తం చేస్తూనే ఉంటుంది. ఇపుడు వంశధార నీటిని ఒడిసిపట్టాలని జగన్ సర్కార్ కృత నిశ్చయంతో ఉంది. ఈ విషయంలో గత ముఖ్యమంత్రుల కంటే కూడా ఒక అడుగు ముందుకేశారు. ఒడిషాతో సమస్యలు ఏమైనా ఉంటే చర్చలకు తాను సిద్ధం అంటూ డైరెక్ట్ గా అక్కడి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కి లేఖ రాశారు. ఇది నిజంగా జగన్ చొరవకు నిదర్శనం అంటున్నారు.దేశంలో జీవజలాలు ఉప్పు సముద్రం పాలు అవుతున్నాయి అంటే దానికి పాలకుల నిర్లక్ష్యమే కారణం అని చెప్పుకోవాలి. సిక్కోలు జిల్లా మీదుగా సముద్రంలోకి వృధాగా పోతున్న వంశధార జలాలు అచ్చంగా 112 టీఎంసీలు ఉన్నాయి. ఆ నీటిని అడ్డుకోవాలంటే ఆనకట్ట నిర్మించాలి. అదే జిల్లాలో నేరడి వద్ద నిర్మించాలని గత ప్రభుత్వాలు సంకల్పించాయి. ఆ భూభాగం సేకరణ విషయంలో ఒడిషా అడ్డుపుల్లలు వేస్తోంది. దీని మీద ట్రిబ్యునల్ తీర్పులను కూడా పక్కన పెడుతోంది. అయితే ఏ ముఖ్యమంత్రి కూడా నేరుగా అక్కడి పాలకులతో చర్చలకు ఇంతవరకూ ముందుకు రాలేదు. ఆ పని ఇపుడు జగన్ చేస్తున్నారు.వంశధార నది నుంచి 112 టీఎంసీల నీటిలో అత్యధిక శాతం శ్రీకాకుళం జిల్లాకు దక్కుతుంది.

ఒక విధంగా చెప్పాలంటే ఈ వెనకబడిన జిల్లా అన్నపూర్ణగా మారుతుంది. అంతే కాదు, సాగు తాగు నీటి కష్టాలు తీరడమే కాదు, పారిశ్రామికంగా కూడా జిల్లా ముందుకు సాగేలా నీటి వనరుల లభ్యత ఉంటుంది. ఇక ఒడిషా ముఖ్యమంత్రితో ఏపీ సీఎం హోదాలో చిట్టచివరి సారిగా చర్చించింది స్వర్గీయ ఎన్టీయార్ మాత్రమే. ఆయన 1986లో నాటి సీఎం బిజూ పట్నాయక్ తో రెండు రాష్ట్రాల సమస్యల మీద ముఖాముఖీ చర్చలు జరిపారు. ఇపుడు జగన్ కూడా ఇన్నేళ్ళ తరువాత నవీన్ పట్నాయక్ తో ముఖాముఖీ చర్చలు జరిపి అన్ని సమస్యలు పరిష్కరించుకోవాలనుకుంటున్నారు. కాగా నేరడి బ్యారేజ్ నిర్మాణం కనుక చేపడితే జగన్ మరో కాటన్ దొర అవుతారని జిల్లాకు చెందిన మంత్రి ధర్మాన క్రిష్ణ దాస్ అంటున్నారు. మొత్తానికి జగన్ అడుగులు ఈ దిశగా పడడం శుభ పరిణామమే అని అంతా అంటున్నారు.

# గిరిజనులను వెంటనే విడుదల చేయాలి

కోవూరు పశ్చిమగోదావరి జిల్లా జిలుగు మిల్లీ మండలం జగన్నాథం పురం గ్రామం మామిడి తోట వివాదంలో అరెస్ట్ చేసిన 25 మంది గిరిజనలను విడుదల చేయాలి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రవి డిమాండ్ చేశారు. బుధ వారం ఉదయం సీపీఎం జిల్లా కార్యాలయం వద్ద సిపిఎం నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 170 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీలుగుమిల్లి మండలం జగన్నాధ పురం గ్రామంలో మామిడి తోట వివాదంలో అక్రమంగా అరెస్టు చేసిన 25 మంది గిరిజనులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక ప్రక్క కరోనా నిబంధనలు, కర్ఫ్యూ నేపథ్యంలో యేజెన్సీ లో పోలీసులను మోహరించి గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. జీలుగు మిల్లి మండలం, జగన్నాధపురం గ్రామం లో అర్ ఎస్ నెంబర్ 1/2,15,17,19,20 నుండి 26 వరకు గల 90 ఏకరాలు మామిడి తోట ను రాష్ట్ర మంత్రి శ్రీరంగరాజు గిరిజనుల భూములను అక్రమంగా సాగు చేస్తున్నారని విమర్శించారు. ఈ భూములపై గిరిజనులు 1/70 చట్ట ప్రకారం అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నారని అన్నారు. కానీ 1/70 చట్టాన్ని కాపాడాల్సిన రాష్ట్ర మంత్రి బాధ్యతలలో ఉండి రంగనాథరాజు గిరిజనుల భూముల్ని ఆక్రమించడం సిగ్గుచేటని రవి విమర్శించారు. తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి న్యాయస్థానాలను కూడా పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. గత సంవత్సరం నుండి కరోనా కర్ఫ్యూను పరిస్థితి అడ్డంపెట్టుకుని గిరిజనులు ఆ పంటలను అనుభవించకుండా చేస్తున్నారని అన్నారు. సరిగ్గా ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం కర్ఫ్యూ ప్రకటించడంతో నిన్నటి నుండి గిరిజనులను పోలీసులతో గిరిజన గ్రామాల్లో 25 మంది ని అక్రమంగా అరెస్టు చేశారు అని అన్నారు. తక్షణమే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తమ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉందని గొప్పలు చెబుతున్నారని, మరి తన మంత్రివర్గంలోని సహచరుడు గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా ఈ రకంగా వ్యవహరించడాన్ని ముఖ్యమంత్రి చర్యలు తీసుకోని, గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాలలో శాంతి యుత వాతావరణం నెల కొల్పాలి అని అన్నారు. ఇంకా ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి కిషోర్, గుడిపాటి నరసింహారావు పి ఆదిశేషు, సత్యనారాయణ, జి శివ కుమార్, ఎం సత్యనారాయణ,ఎన్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

# ఇకపై ఆక్సిజన్ కు డోకా లేదు

## కరోనా రోగులకు ఎంపీ ధైర్యం

## ఆక్సిజన్ కొరత తీర్చేందుకు ప్రత్యామ్నాయ చర్యలు

## పేపర్ మిల్ యాజమాన్యం తో ఎంపీ మార్గాని చర్చలు

రాజమహేంద్రవరం..కరోనా రోగుల ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన ఆక్సిజన్ కొరతను తీర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు రాజమహేం ద్రవరం పార్లమెంటు నియోజక వర్గ సభ్యులు వైకాపా పార్లమెంటరీ పార్టీ చీఫ్ విప్ మార్గాని భరత్ రామ్ వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ పేపర్ మిల్లు లో గత ఆరు నెలలుగా మూతపడి ఉన్న ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. కరోనా వైరస్ బారిన పడిన వారికి ఆక్సిజన్ కొరత ఉంటున్న నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ పేపర్ మిల్లు 15 టన్నుల ఆక్సిజన్ను ఉత్పత్తిచేసే యూనిట్ నిరుపయోగంగా ఉన్నట్లు 2 రోజుల క్రితం తెలుసుకున్న ఎంపీ మార్గాని భరత్ రామ్ తక్షణమే స్పందించి సంబంధిత మిల్లు యాజమాన్యాన్ని సంప్రదించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే తక్షణమే సంబంధిత ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాన్ని పున ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఆయన నడుంబిగించారు. ఈ నేపథ్యంలోనే గురువారం ఉదయం పేపర్ మిల్లు ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాన్ని ఆయన సందర్శించడంతో పాటు, మిల్ యాజమాన్యం ప్రతినిధులతో సంప్రదింపులు చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలని ఎంపీ మార్గాన్ని భరత్ రామ్ చేసిన సూచనలను పరిగణలోకి తీసుకున్న యాజమాన్యం సైతం ముందుకొచ్చి తక్షణమే ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాన్ని పున ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్ రామ్ మీడియాతో మాట్లాడుతూ రాజమహేంద్రవరం పేపర్ మిల్లు లో పది టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రం నిరుపయోగంగా ఉన్నట్లు తెలుసుకున్న వెంటనే దానిని పున ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఢిల్లీ నుంచి అవసరమైన టెక్నీషియన్స్ తక్షణమే యాజమాన్యం పంపించిందని సంబంధిత మరమ్మతు పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ఉత్పత్తి కేంద్రం పున ప్రారంభం అయితే 15 కిలో లీటర్ల ఆక్సిజన్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు 45 కిలో లీటర్ల ఆక్సిజన్ అవసరం అవుతుందని తెలిపారు. పేపర్ మిల్ ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రం నుంచి ఆక్సిజన్ ఉత్పత్తిని ప్రారంభిస్తే మూడో వంతు ఆక్సిజన్ ను ఇక్కడి నుంచే సరఫరా చేసే అవకాశం ఉందని తెలిపారు.ఆక్సిజన్ ఉత్పత్తి స్థానికంగా అందుబాటులోకి వస్తే జిల్లా అవసరాల్లో 30 శాతం తీరుతాదని తెలిపారు. నాలుగు రోజుల్లో ఇక్కడ ఉత్పత్తిని ప్రారంభిస్తామని పేపర్ మిల్ యాజమాన్యం హామీ ఇచ్చిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల్లో ఆక్సిజన్ కొరత తీర నుందని, ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులతో పాటు, జిల్లా కలెక్టర్ తో మాట్లాడటం జరిగిందనీ అన్నారు. ఆక్సిజన్ కొరత అనేది ప్రపంచ వ్యాప్తంగా ఉందని అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆక్సిజన్ కొరత లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆక్సిజన్ కొరత అనేది కేవలం ప్రైవేట్ ఆసుపత్రిలో మాత్రమే ఉందని, ప్రభుత్వం గుర్తించిన ఆసుపత్రుల తో పాటు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఆక్సిజన్ కొరత లేదని గుర్తించాల న్నారు.

### ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట స్ట్రెచర్ పై మృతదేహం

ఖమ్మం కరోనాతో బాధపడుతున్న వ్యక్తి వైద్య సేవల కోసం మూడు గంటలపాటు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట స్ట్రెచర్‌పై వేచి చూసి(ఆగి) చివరికి వైద్య సేవలు పొందకుండానే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం ఊట్కూర్‌కు చెందిన ద్రాక్షపల్లి శంకర్(48)కు వారం క్రితం కరోనా బారినపడ్డాడు. బుధవారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు లోనవడంతో కుటుంబ సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి తరలించారు పరిస్థితి విషమంగా ఉందని ఖమ్మం ప్రధాన ఆసుపత్రికి తీసుకెళ్లాలని అక్కడి సిబ్బంది సూచించారుదీంతో కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# పండ్ల మార్కెట్ పై కరోనా దెబ్బ




ఒంగోలు, మే 6, (న్యూస్ పల్స్)ప్రకాశం జిల్లా ఉలవపాడు సమీపంలో పండే బంగినపల్లి మామిడి, పాల సపోటా దేశవ్యాప్తంగా పేరుగాంచాయి. ఇప్పుడు ఈ పండ్ల సీజన్ వచ్చింది. కాయలు కోతకు వచ్చాయి. కరోనా దెబ్బకు అంతర్రాష్ట్ర మార్కెట్లు మూతపడ్డాయి. కొన్ని అరకొరగా నడుస్తున్నాయి. దీంతో, మామిడి, సపోటా ఎగుమతులు, ధరలపై ఈ ఏడాదీ ప్రభావం కనిపిస్తోంది. రైతులు, వ్యాపారులు కలవరపడుతున్నారు. కరోనా ప్రభావంతో వరుసగా రెండో ఏడాదీ పండ్ల మార్కెట్లు సంక్షోభంలో పడుతున్నాయి. ముందుగా తోటలను కొనుగోలు చేసిన వ్యాపారులు కూడా నష్టపోతున్నారు. పరిస్థితులు ఇదే తీరున ఉంటే రైతులకు కూడా ధరలు తగ్గుతాయి.చెన్నైలోని కోయంబేడు మార్కెట్ రెండు, మూడు రాష్ట్రాలకు కీలకంగా మారింది. ఇక్కడ సుమారు 500కుపైగా హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. అక్కడకు జిల్లాలోని ఉలవపాడు, కందుకూరు ప్రాంతాల నుంచి రోజుకు పది నుంచి 15 లారీల మామిడి, నాలుగు నుంచి ఐదు లారీల వరకూ సపోటా వెళ్తుంది. అక్కడ వాటిని రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేసి చెన్నరు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు తీసుకెళ్తారు. అక్కడి నుంచి కొందరు వ్యాపారులు జిల్లాకు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తుంటారు. మామిడి టన్ను రూ.40 వేల నుంచి రూ.60 వేలు అమ్ముతుంది. సపోటా బస్తా రూ.450 దాకా ఉంటుంది. ఈ ఏడాది కోయంబేడు మార్కెట్ మూతపడడంతో సగం దుకాణాలే ఉన్నాయి దీని ప్రభావం ధరలపైనా ఉంది. ఎగుమతులు ఆగాయి. కోతలు తగ్గాయి. టన్ను మామిడి ప్రస్తుతం రూ.30 వేల నుంచి రూ.40 వేలులోపే ఉంది. బెంగళూరు, అహ్మదాబాదు, ముంబయి, హైదరాబాదు తదితర పట్టణాలకూ మామిడి ఎగుమతులు ఈ ఏడాది నిల్చిపోయాయి. ఆయా ప్రాంతాల్లోని మార్కెట్లు మూతపడమే ఇందుకు కారణం.ఇతర రాష్ట్రాల్లో మార్కెట్లు లేవు. దీంతో, పండ్లను ఏదో రకంగా అమ్ముకునేందుకు రైతులు, వ్యాపారులు ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నారు. ఉలవపాడు నుంచి రాజుపాలెం వరకూ మూడు కిలోమీటర్ల పొడవున జాతీయ రహదారికి ఇరువైపులా పండ్ల దుకాణాలు పెట్టుకున్నారు. తోటల బయటే దుకాణాలు పెట్టుకుని అమ్ముతున్నారు. సుమారు 200 దుకాణాలకు పోలీసులు అనుమతి ఇచ్చారు. తోటలను కొనుగోలు చేసిన చిరువ్యాపారులు కూడా ఇక్కడే షెడ్లు వేసుకుని పండ్లను అమ్ముతున్నారు. . మేలో ఉలవపాడు మామిడి ఎక్కువగా దిగుబడి రానుంది. అప్పుడు మార్కెట్ పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి. పట్టణాల్లోనూ పాక్షిక లాక్‌డౌన్లు అమలవుతున్నందున తోపుడు బండ్లపై అమ్ముకునే పండ్ల వ్యాపారులు కూడా అవస్థలు పడుతున్నారు.

# ఎమ్మెల్యేను అడ్డుకున్న సీపీఐ నేతలు

కదిరి అనంతపురం జిల్లా కదిరి ప్రభుత్వ హాస్పిటల్ లో కరోనా రోగులకు మెరుగైన వైద్యం అందివ్వడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రభుత్వ హాస్పిటల్ సందర్శన కు వస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి ని గేటు బయటే సీపీఐ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే గో బ్యాక్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేసారు. ఒక్కసారిగా ఎమ్మెల్యే కారు ముందు బైఠాయించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి అందోళనకారులను ప్రక్కకు నెట్టివేసారు. అతి కష్టం మీద ఎమ్మెల్యే కారులు లోపినికి పంనించారు. ప్రజా సమస్యలు వినడానికి కూడా ఓపిక లేని ఎమ్మెల్యే ని ఎక్కడ చూడలేదంటూ సీపీఐ నాయకులు మండిపడ్డారు.

# విద్యుత్ షాక్ తో పాడి పశువులు మృతి

విజయవాడ కృష్ణా జిల్లా చందర్లపాడు మండలం రామన్నపేట గ్రామంలో కృష్ణానదిలో త్రాగు నీటి కోసం వెళ్లిన పశువులు దుర్మణం పాలయ్యాయి. కృష్ణానదిలో విద్యుత్ తీగలు తగిలి పాడి పశువులు షాక్ కు గురికావడంతో పది గేదలు అక్కడికక్కడే మృతి చెందాయి. కృష్ణానదిలో ఉన్న విద్యుత్ మోటార్ వైర్లు తగిలిఆ గేదెలు మృతి చెందాయి. సుమారు ఏడు లక్షల రూపాయలు విలువ చేసే గేదలు మృతిచెందడంతో పశువుల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సర్పంచ్ లకు వెంటనే చెక్ పవర్ ఇవ్వాలి

## ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్

విజయవాడ మూడు నెలల క్రితం నూతనంగా ఎన్నికైన 12 వేలమంది సర్పంచ్ లకు ఇంత వరకు చెక్ పవర్ ఇవ్వకపోవడాన్ని మా ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ తీవ్రంగా ఖండిస్తోందని ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్ విమర్శించారు. కరోనా వైరస్ ను ఎదుర్కోవడానికి 12 వేల గ్రామాల్లో చేపట్టవల్సిన పారిశుద్య పనులకు నిధులు రాక సర్పంచ్ లు ఇబ్బందులు పడుతున్నారు. సీఎఫ్ఎంఎస్ ఖాతా క్రింద ఉన్న గ్రామ పంచాయతీ నిధులు, 14, 15 వ ఆర్థిక సంఘం నిధులను సుమారు 3 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి తన స్వంత అవసరాలకు వాడేసుకుంది. అందుకే సర్పంచ్ లకు చెక్ పవర్ ఇవ్వడం లేదని అన్నారు.దీని వల్లన కరోనా నివారణ చర్యలు చేపట్టలేక సర్పంచ్ లు ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారు. గ్రామ పంచాయితీలు నిర్వీర్యం అవ్వడం తో గ్రామీణ ప్రజలు కరోనా బారినపడి చనిపోతున్నారు. తక్షణమే సర్పంచ్ లకు చెక్ పవర్ ఇచ్చి గ్రామీణ ప్రజల్ని ఆదుకోవాలని ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి ని మా ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ ఛాంబర్ డిమాండ్ చేస్తుందని అన్నారు.

# వైరస్ తో కాదు భయంతోనే.

మంత్రాలయం( విభారె) కోవిడ్ 19 మహమ్మారి శరవేగంగా వ్యాపిస్తూ అనేక మంది ప్రజల ప్రాణాలను అత్యంత వేగంగా,అత్యంత దారుణంగా తీస్తూ ప్రపంచంలో మరణ మృదంగం సృష్టిస్తూ కరోనా విలయతాండవం చేస్తోంది. ప్రజల జీవన విధానాలను రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతుంది. కరోనాకు వైద్యుల సలహాలు పాటిస్తూ ట్రీట్మెంట్ తీసుకుంటూ దాంతోపాటు నేను బ్రతుకుతాను నాకు తగ్గిపోయింది అని మనోధైర్యం అనే మందులు తీసుకుంటూ కొన్ని వేల లక్షల కోట్ల మంది కోవిడ్ పాజిటివ్ నుంచి నెగిటివ్ గా బయటపడి ఆరోగ్యంగా ఉన్నారు. కానీ కొంతమంది కోవిడ్ అనే మహమ్మారికి భయపడి చికిత్స తీసుకుంటూ మానసికంగా బాధపడుతూ హార్ట్ బీట్ పెంచుకుంటూ బ్లడ్ ప్రజర్ ఎక్కువై ప్రాణాలు కోల్పోతున్నారు. భయమే వారి ప్రాణాలను తీస్తుంది. ధైర్యమే చాలా మంది ప్రాణాలను కాపాడుతుంది. ఎందుకంటే చాలామంది కరోనా సోకితే ధైర్యంగా ట్రీట్మెంట్ తీసుకుంటే నాకు బాగవుతుంది మెరుగవుతుంది ట్రీట్మెంట్ తీసుకుంటున్న ఆరోగ్యంగా ఇంటికి వస్తాను అని అనుకుంటే వారి ధైర్యమే వారికి మందులా (తారక మంత్రంలా )పని చేస్తూ ఆరోగ్యవంతంగా ఇంటికి వచ్చిన సందర్భాలు కొన్ని లక్షల్లో ఉన్నారు. కానీ చాలామంది మానసికంగా బాధపడుతూ తమ చుట్టుపక్కల ఏదో ఒకటి రెండు మరణాలను చూస్తూ, వింటూ మనసులోనే మానసికంగా బాధపడుతూ తమకు కరోనా వస్తే పరిస్థితి ఏంటి నేను చనిపోతే నా భార్య పిల్లల గతి ఏంటి అనుకుంటూ మానసికంగా తీవ్రమైన ఒత్తిడికి గురై హార్ట్ బీట్ పెరిగి బ్లడ్ ప్రెజర్ ఎక్కువై శ్వాసకోశ సంబంధిత ఉద్వేగాలకులోనై ప్రాణాలను కోల్పోతున్నారు. దీనికి మందు ధైర్యమే. ధైర్యే సాహసే లక్ష్మీ అన్నట్టు. ధైర్యే సాహసే ప్రాణం. కరోనా లక్షణాలు ఉన్నా లేకపోయినా ధైర్యంగా ఉంటూ వైద్యులు సూచించిన నియమ నిబంధనలు పాటిస్తూ ,పోలీస్ అధికారులు సూచనలు పాటిస్తూ బయట తిరగకుండా దాదాపుగా ఇంటికే పరిమితమై మాస్క్ ధరిస్తే రక్షణ వలయాలు పాటిస్తే ఆరోగ్యంగా ఉంటాం, ప్రాణాలతో ఉంటాం. కానీ ఎప్పుడు టీవీ వార్తలు చూస్తూ ,చనిపోయిన వారి గురించి ఆక్సిజన్ అందక చనిపోయిన వార్తలు చూస్తూ మానసిక

### మానసిక భయంతో మరణాలు.
### భయమే వైరస్. ధైర్యమే మందు

ఒత్తిడికి లోనై అనారోగ్యం పాలైన వారు చాలా మంది ఉన్నారు .ఈ సీజన్లో ఎటువంటి సింటమ్స్, తలనొప్పి జ్వరం దగ్గు వచ్చిన కరోనా అంటూ చుట్టుపక్కల వాళ్ళు బంధుమిత్రులు భయ పెడుతున్నారు. కాబట్టి ఎటువంటి ఉద్వేగానికి లోను కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే డాక్టర్ దగ్గరికి వెళ్లి డాక్టర్ సలహాలు పాటిస్తూ ట్రీట్మెంట్ తీసుకుని ఆరోగ్యంగా ఉండాలి. దాదాపుగా కరోనా వార్తలకు దూరంగా ఉంటూ మానసిక ఉల్లాసానికి సంబంధించిన పనులు చేస్తూ లేక ఆహ్లాదం అనిపించే పాటలు వింటూ రోజులు గడపాలి .టైం పాస్ చేయాలి. అంతేగాని నాకు టైం పాస్ కావడం లేదు ఇంట్లో బోర్ కొడుతుంది అంటూ రోడ్లవెంబడి తిరుగుతూ మాస్క్ లేకుండా భౌతిక దూరం పాటించకుండా ఎక్కడ పడితే అక్కడే తిరుగుతూ రోడ్డు మీద ఉన్న కరోనాను తాను వెంట తీసుకొని వచ్చి ఇంకా కుటుంబ సభ్యులందరికి అంటించి బాధ పడడం , ప్రాణాలు పోగొట్టుకోవడం కన్నా ,ఇంట్లోనే ఉంటూ ప్రాణాలు కాపాడుకోవడం అందరికీ మంచిది. ఒక్కసారి ఆలోచించండి. మనం చేసిన ఒక్క పొరపాటు వల్ల మన ప్రాణాలు మన కుటుంబ సభ్యుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోతాయి.ఇప్పటివరకు చూసిన మరణాలు చూస్తుంటే ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారు. కారణం భద్రత పాటించకపోవడం . నేను యువకున్ని నాకేం అవుతుందిలే అంటూ మొండిగా అనవసరంగా బయట తిరగడం ప్రాణాలు కోల్పోవడం. ఒకసారి ఆలోచించండి మీరు లేకపోతే మీ కుటుంబ సభ్యుల పరిస్థితి ఏంటి వారు ఎలా బ్రతుకుతారు ? భార్యా పిల్లల పరిస్థితి ఏంటి ? వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పోలీసులకు, అధికారులకు సహకరించండి. ప్రాణాలు కాపాడుకోండి. పోలీసులు ,వివిధ శాఖల అధికారులవి కూడా ప్రాణాలే కదా వారు కూడా వారి కుటుంబ సభ్యులను వదిలి , మన ప్రాణ రక్షణ కోసం 24 గంటల డ్యూటీ చేస్తూ మనల్ని రక్షిస్తున్న రక్షకభటులు వాళ్ళు .కాబట్టి పోలీసులకు అధికారులకు సహకరిద్దాం

# 'తేనె' వల్ల ఆరోగ్యమే కాదు.. అందం కూడా..!!



'తేనె' లేని వంటిల్లు ఉండదు. అద్భుతమైన రుచి ఉన్న తేనె తీసుకోని వారు ఉండరు. తనలో ఎన్నో ఔషధ గుణాలు ఇమిడ్చుకున్న తేనె మన ఆరోగ్యంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. శ్రేష్టమైన తేనెలో సుగుణాలెన్నో ఉన్నాయి. మంచి ఆరోగ్యం, బలం ఇస్తుంది. అనారోగ్యాలను దూరం చేస్తుంది. అంతర్గతంగానే కాదు.. బాహ్యంగా మన అందాన్ని కూడా ద్విగుణీకృతం చేస్తుంది. మన ముఖాన్ని అందంగా ఉండేలా చేస్తుంది. మేని ఛాయతో మెరిసేలా మారుస్తుంది. ఇలా.. తేనెతో ఎన్నో ప్రయోజనాలు మన జీవనంలో ముడిపడి ఉన్నాయి. ఆహార వినియోగంలో పంచదార తగ్గించి తేనె తీసుకుంటే మన ఆరోగ్యానికి చాలా మంచిది.బాడీ అంతా ఫ్రెష్ గా ఉండాలి.. క్లీన్ గా ఉండాలంటే స్నానం చేసే నీటిలో మూడు టీస్పూన్ల తేనె, 2 టీస్పూన్ల ఆలివ్ ఆయిల్‌ను కలపాలి. ఆ నీటితో స్నానం చేస్తే చర్మం మెరుస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు రోజుకు రెండుసార్లు తేనె తీసుకోవడం ఉత్తమం. అందంగా, మేని ఛాయతో నాజూగ్గా ఉండాలన్నా తేనె వాడకం తప్పనిసరి. దగ్గు వస్తుంటే.. ఓ టీస్పూన్ తేనెలో కొద్దిగా నిమ్మరసం కలిపి తాగితే దగ్గు తగ్గుతుంది.డయాబెటిస్ ఉన్నవారు షుగర్ ఫ్రీ బదులుగా తేనెను వాడొచ్చు. ఇందులో కమ్మొమైల్ ఉంటుంది. అది బ్లడ్ లో షుగర్ లెవెల్స్ తగ్గిస్తుంది. తేనె సహజ గుణాలున్న యాంటీబయోటిక్. శరీరంపై గాయాలున్నా, కాలినా తేనెను రాసి మసాజ్ చేస్తే గాయం మటుమాయం అవుతుంది. ఉదయం అలసటగా ఉంటే తేనె, పాలు కలిపి తీసుకోవచ్చు. దీంతో బలం వస్తుంది.. యాక్టివ్ అవుతాం. ఒత్తిడితో నుంచి ఉపశమనం పొందాలన్నా టీలో ఓ స్పూన్ తేనె కలపి తీసుకుంటే సరి.గొంతు ఇన్ ఫెక్షన్ ఉన్నా.. కఫంతో ఇబ్బంది పడుతున్నా తేనె మంచి మందులా పని చేస్తుంది. కఫాన్ని కరిగించి శ్వాసనాళాన్ని ఫ్రీగా చేస్తుంది. నిమ్మరసంలో తేనె కలిపి తీసుకోవడం వల్ల శరీరంలో మెటబాలిజం పెరుగుంది. దీంతో పేగుల కదలిక బాగుంటుంది. ప్రతిరోజూ ఉదయాన్నే తేను తీసుకోవడం వల్ల యాక్టివ్ గా కూడా ఉంటాం. ఇన్ని గుణాలతో 'తేనె' మన ఆరోగ్యంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పాలి.గమనిక: ఈ వివరాలు మీ అవగాహన కోసం మాత్రమే. పలు సందర్భాల్లో ఆహార నిపుణులు, వైద్యులు అందించిన వివరాలనే ఇక్కడ ఇచ్చాం. మీ ఆరోగ్యం విషయంలో ఎటువంటి సమస్య ఉన్నా, సలహాలకైనా వైద్యులను, ఆహార నిపుణులను సంప్రదించడమే ఉత్తమం. మీ ఆరోగ్యానికి సంబంధించి 'తెలుగు రాజ్యం' ఎటువంటి బాధ్యత వహించదు. గమనించగలరు.

# (డబ్బు కోసం లీగ్‌లు ఆడం.. నా జీవితాన్ని మార్చేసింది




జోహన్నెస్‌బర్గ్ : ఐపీఎల్ లాంటి లీగ్‌ల ద్వారా నైపుణ్యం ఉన్న ఆటగాళ్లు ఎందరో పరిచయమయ్యారు. రవీంద్ర జడేజా, అజింక్య రహానే లాంటి ఆటగాళ్లు ఐపీఎల్‌లో ఆడిన తర్వాతే భారత జట్టులో చోటు సంపాదించారు. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా బౌలర్ తబ్రెజ్ షంసీ టీ20 లీగ్‌లపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. cc ఏ దేశానికి చెందిన ఆటగాడైనా సరే.. డబ్బుల కోసం లీగ్ మాత్రం ఆడడు.. ఆటలో నైపుణ్యం చూపించే అవకాశం ఇలాంటి లీగ్‌ల ద్వారానే వస్తాయి. నా దృష్టిలో సీపీఎల్, ఐపీఎల్, ఇంగ్లీష్ దేశాల్లో ఆడే కౌంటీ క్రికెట్ ద్వారా ఆట మెరుగైందని అనుకుంటున్నా. నేను ఇవాళ దక్షిణాఫ్రికా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నా అంటే దానికి ఇలాంటి లీగ్‌లే కారణం.ఇలాంటి లీగ్స్‌లో ఆడడం వల్ల వివిధ దేశాలకు చెందిన ఆటగాళ్లతో పరిచయాలు.. వారితో కలిసి ఆడడం వల్ల బౌలింగ్‌లో మరిన్ని మెళుకువలు సాధించే అవకాశాలుంటాయి. నేను ఐపీఎల్ ఆడిన మ్యాచ్‌లు తక్కువే కావొచ్చు.. కానీ కరేబియన్ లీగ్‌లో మాత్రం చాలా మ్యాచ్‌లు ఆడాను.. అది నా జీవితాన్నే మార్చేసింది.cc అని చెప్పుకొచ్చాడు. కాగా షంసీ 2016లో రైజింగ్ పుణే సూపర్‌జెయింట్స్ తరపున ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. ఇక దక్షిణాఫ్రికా తరపున 2 టెస్టుల్లో 6 వికెట్లు, 24 వన్డేల్లో 27 వికెట్లు, 32 టీ20ల్లో 31 వికెట్లు తీశాడు.ఐపీఎల్ 14వ సీజన్ రద్దు అనంతరం లీగ్‌లో పాల్గొన్న విదేశీ ఆటగాళ్లు ఎవరి సొంత దేశాలకు వారు చేరుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఇప్పటికే వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ ఆటగాళ్లు వారి సొంత దేశానికి చేరుకోగా.. ఆస్ట్రేలియా ఆటగాళు మాత్రం డైరెక్ట్‌గా దేశానికి వెళ్లే అవకాశం లేకపోవడంతో మాల్దీవ్స్‌కు వెళ్లి అక్కడినుంచి ఆసీస్‌కు వెళ్లనున్నారు. ఇక న్యూజిలాండ్‌కు చెందిన ఆటగాళ్లలో కొందరు స్వదేశానికి వెళ్లగా.. భారత్‌తో టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఆడాల్సి ఉన్న నేపథ్యంలో మరికొందరు ఆటగాళ్లు మాత్రం ఇంగ్లండ్‌కు చేరుకున్నారు.

# అన్నదాన మహాభాగ్యం

మంత్రాలయం ( విభారె) అన్నదానం మహా భాగ్యం ,మహా గొప్ప ఉన్నతమైన సంకల్పం అని మహా గొప్ప సహాయం అని స్థానిక సిఐ. కృష్ణయ్య పేర్కొన్నారు.మంత్రాలయంలో గత వారం రోజులుగా స్వచ్ఛందంగా దుకాణదారులు లాక్ డౌన్ చేస్తున్న నేపథ్యంలో బుధవారం నుండి ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్ఫ్యూ విధించిన నేపథ్యంలో అనాథలకు బిచ్చగాళ్లు ఆకలితో అలమటించిపోయారు.హోటళ్ళు కూడా దాదాపుగా బంద్ కావడంతో కడుపు నింపుకోవడమే చాలా కష్టం అయిపోయింది. అనాథల ఆకలి బాధలు చూడలేక స్థానిక పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ కానిస్టేబుల్ మనసు చలించిపోయింది .నీతో వంట మాస్టర్ గోనవరం రవి తో మాట్లాడి ఐదు రోజులకు సరిపడా ,రోజూ రెండు పూటలకు సరిపడా వంట సరుకులను కొనుగోలు చేసి గురువారం నుండి మధ్యాహ్నం, రాత్రికి రెండు పూటలా అనాథలకు అన్నదానం చేయాలని

### అనాధలకు అన్నదానం చేసిన కానిస్టేబుల్

నిశ్చయించుకున్నారు. వంట మాస్టర్ గోనవరం రవితో వంటలు చేయించి అన్నం సాంబారు మజ్జిగ చేయించి స్థానిక సిఐ.కృష్ణయ్య ను ఆహ్వానించి తుంగభద్రా నదీ తీరంలో అనాధలకు బిచ్చగాళ్లకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సిఐ. కృష్ణయ్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కర్ఫ్యూ సమయంలో ఆకలితో అలమటిస్తున్న అనాధలను బిచ్చగాళ్ళ ను చూసి మనసు చలించి పోయిన మా కానిస్టేబుల్ వారికి అన్నదానం చేయాలని నిశ్చయించుకోవడం చాలా గొప్ప పని అని గొప్ప సహాయం అని సీఐ కృష్ణ కానిస్టేబుల్ కానిస్టేబుల్ ను మనస్ఫూర్తిగా అభినందించారు.. కరోనా కష్టకాలంలో ,కర్ఫ్యూ సమయంలో ఆకలితో అలమటిస్తున్న వారిని చూసి చాలా బాధేసింది అని వారికి ఎలాగైనా నా వంతు సహాయంగా కొన్ని రోజుల పాటు వారికి కడుపు నిండా అన్నం పెట్టాలి

# హమ్మయ్య! ఎన్నాళ్లకెన్నాళ్లకు.. సోలో మూవీతో..



ఇంటర్నెట్ డెస్క్: సినిమా తీయడం అంత సులువేం కాదు. ఎంతో మంది చెమటోడ్చి కష్టపడాలి. వందలమంది ఎన్నో ప్రాంతాల్లో తిరిగి ఎంతో శ్రమిస్తే కానీ ఓ సినిమా పూర్తి కాదు. అయితే వీరందరూ ఎంత కష్టపడుతున్నా వీరందరి వెనక ఉండి నడిపించేది డబ్బు. ఆ డబ్బును పెట్టుబట్టిగా పెట్టే నిర్మాత, నిర్మాణ సంస్థ. అంతా కష్టపడి తమ రెమ్యునరేషన్లు, జీతాలు అన్నీ తీసుకుని వెళ్లిపోతారు. తీరా సినిమా విడుదలైన తరువాత ఫ్లాప్ అయితే ఆ నష్టం మొత్తం నిర్మాతలదే. అయితే లాభాలు వచ్చినా వారివే. అందుకే దీనికి అనేకమంది నిర్మాతలు 'సినిమా అనేది ఓ రకమైన గాంబ్లింగ్ అండి' అని నవ్వేస్తుంటారు.ఈ భయంతోనే కొన్ని నిర్మాణ సంస్థలు సోలోగా కాకుండా వేరే సంస్థలతో కలిసి సినిమాలు నిర్మిస్తుంటాయి. అయితే మెగా ఫ్యామిలీకి చెందిన గీతా ఆర్ట్స్ మాత్రం తొలి నుంచీ సోలోగా సినిమాలు నిర్మిస్తూ మంచి హిట్లు కొట్టింది. అయితే ఏమైందో ఏమో కొన్నేళ్లుగా ఒక్క సోలో సినిమాతో కూడా ప్రేక్షకులను పలకరించలేదు. అయితే ఎట్టకేలకు ఓ సోలో సినిమాను నిర్మించబోతోంది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది.టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన గీతా ఆర్ట్స్.. గత ఐదు దశాబ్దాలుగా సినిమాలు చేస్తూ సక్సెస్ ఫుల్ బ్యానర్‌గా నిలిచింది. ఎక్కువ శాతం మెగా హీరోలతోనే సినిమాలు తీసే ఈ సంస్థ.. కొన్ని హిందీ తమిళ కన్నడ చిత్రాలనూ నిర్మించింది. అయితే దాదాపు నాలుగేళ్లుగా సోలోగా సినిమాలను నిర్మించడం మానేసింది.2016లో అల్లు శిరీష్ తో చేసిన 'శ్రీరస్తు శుభమస్తు' సినిమా తర్వాత మరో సినిమా చేయలేదు. ఇటీవల 'ధ్రువ' 'అల వైకుంఠపురంలో' సినిమాలు చేసినా.. అవి వేరే నిర్మాణ సంస్థల భాగస్వామ్యంతో నిర్మించారు. ప్రస్తుతం చేస్తున్న 'జెర్సీ' హిందీ రీమేక్ కూడా ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, అమన్ గిల్‌లతో కలిసి గీతా ఆర్ట్స్ నిర్మిస్తోంది.అయితే ఇన్నాళ్ల తరువాత.. కాదు కాదు.. ఇన్నేళ్ల తరువాత గీతా ఆర్ట్స్ పతాకంపై సోలోగా ఓ సినిమా రాబోతోందని వార్తలు వస్తున్నాయి. అది కూడా స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురగదాస్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా ఈ సినిమా తెరకెక్కనుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ నిర్మిస్తారని సమాచారం. ఇప్పటికే 'గజిని 2' అనే టైటిల్‌ని కూడా రిజిస్టర్ చేయించినట్లు టాక్. మరి ఈ సినిమా సెట్స్‌పైకి ఎప్పుడు వెళుతుందనే విషయం మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంది.

# మహేష్ - పవన్ ల మధ్య సంక్రాంతి ఫైట్ లేనట్లేనా..?



కరోనా మహమ్మారి కారణంగా 2021 సంక్రాంతి వార్ లో స్టార్ హీరోల సినిమాలు లేకుండా పోయాయి. అయితే వచ్చే ఏడాది సంక్రాంతికి ఆ లోటు తీర్చడానికి పెద్ద హీరోల అప్పుడే సినిమాల విడుదల తేదీలను ప్రకటించారు. సూపర్ స్టార్ మహేష్ బాబు - పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఇద్దరూ బాక్సాఫీస్ బరిలో దిగుతున్నట్లు ప్రకటించారు. మహేష్ - డైరెక్టర్ పరశురామ్ కాంబోలో తెరకెక్కుతున్న 'సర్కారు వారి పాట'.. పవన్ - క్రిష్ కలిసి చేస్తున్న 'హరి హర వీరమల్లు' చిత్రాలను 2022 సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే పవన్ - మహేష్ మధ్య బాక్సాఫీస్ వార్ ఉండకపోవచ్చని అంటున్నారు.'సర్కారు వారి పాట' అనుకున్న తేదీకి వచ్చే అవకాశాలున్నాయి కానీ.. 'వీరమల్లు' సినిమా సంక్రాంతికి రావడం కష్టమే అనే టాక్ ప్రస్తుతం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇప్పటికే దుబాయ్ లో భారీ షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకున్న మహేష్ సినిమా.. గ్రాఫిక్స్ వర్క్ అవసరం లేదు కాబట్టి మెల్లగా షూట్ చేసినా పెద్ద పండక్కి రెడీ అవుతుంది. కానీ 'వీరమల్లు సినిమా భారీ సెట్స్ లో షూట్ చేయాల్సి ఉంది. అందులోనూ ఎక్కువ వీఎఫ్ఎక్స్ వర్క్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికి కేవలం 45 శాతం మాత్రమే చిత్రీకరణ పూర్తయింది. ఒకవేళ షూటింగ్ అప్పటికి పూర్తయినా సీజీ పనులకు చాలా సమయం కావాలి. దీనికి తోడు పవన్ రెండు సినిమాలు ప్యారలల్ గా షూట్ చేయాల్సి ఉంది. ఇవన్నీ చూసుకుంటే 'వీరమల్లు' కాస్త లేట్ అయ్యే అవకాశం ఉన్నాయి.కరోనా సెకెండ్ వేవ్ కారణంగా అన్ని పనులు ఆగిపోయాయనని.. షూటింగ్ కంప్లీట్ అవడానికి ఇంకా చాలా సమయం పట్టేలా ఉందని నిర్మాతే చెబుతున్నాడు. ఈ నేపథ్యంలో మహేష్ - పవన్ ల మధ్య సంక్రాంతి వార్ ఉండకపోవచ్చని అంటున్నారు. వాస్తవానికి ఇప్పటి వరకు ఈ ఇద్దరు స్టార్ హీరోలు నాలుగు సార్లు కొన్ని రోజుల గ్యాప్ తో సినిమాలు రిలీజ్ చేసినప్పటికీ.. ఇంత వరకు డైరెక్ట్ బాక్సాఫీస్ బరిలో పోటీ పడలేదు. 'సర్కారు వారి పాట' 'హరి హర వీరమల్లు' తో ఇద్దరూ పోటీ పడతారు అనుకున్నారు కానీ.. సిచ్యుయేషన్ చూస్తుంటే బాక్సాఫీస్ ఫైట్ ఉండకపోవచ్చని అంటున్నారు.




# త్రివిక్రమ్ సినిమాలో మహేశ రోల్‌ఎలా ఉండబోతుందంటే..?

సూపర్‌స్టార్ మహేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్.రాధాకృష్ణ ఓ సినిమాను నిర్మించబోతున్న సంగతి తెలిసిందే. అనౌన్స్‌మెంట్ రోజు నుంచే ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. అలాగే సినిమాకు సంబంధించిన వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. లేటెస్ట్‌గా మహేశ్ పాత్రకు సంబంధించిన



వార్తొకటి చక్కర్లు కొడుతోంది. తన 28వ సినిమాలో మహేశ్ రా ఏజెంట్ పాత్రలో కనిపించబోతున్నారట. ఇప్పటికే డైరెక్టర్ త్రివిక్రమ్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తూనే ప్రీ ప్రొడక్షన్ పనులపై ఫోకస్ పెట్టారు. కృష్ణ పుట్టినరోజు సందర్భంగా(మే 31) ఈ సినిమా లాంఛనంగా ప్రారంభం అవుతుందని చిత్ర యూనిట్ తెలియజేసింది. అలాగే సినిమాను వచ్చే ఏడాది వేసవిలో విడుదల చేస్తామని కూడా నిర్మాత తెలిపారు. మహేశ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందిన అతడు, ఖలేజా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద అనుకున్న ఫలితాలను రాబట్టుకోలేకపోయాయి.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190